www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్
29 జూలై 2023
సంపుటి:1 సంచిక:279

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## వరద ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

- ఎంతమంది చనిపోయారో తెలుసా..?
- సహాయక చర్యలు ఏం చేశారు
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

2 లో






## ఐజిబిసి గ్రీన్ ప్రాపర్టీ షో సందడి షురూ

- హైదరాబాద్ వేదికగా తొలి ఐజిబిసి ప్రాపర్టీ షో
- హైటెక్స్ ప్రారంభించిన మంత్రి కేటీఆర్

2

"పోలిటికల్ ఫ్యామిలీ ప్యాకేజీలో మరో సంఖ్య పెరిగింది. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుటుంబం నుంచి మరో వారసుడు అరంగేట్రం చేశారు. ఇప్పటికే చాలా మంది కేసీఆర్ బంధువులు బీఆర్ఎస్లో వేళ్లూనుకుని ఉన్నారు. ఉద్యమకాలం నుంచి తన వెంట నడుస్తున్న వదిన కుమారుడు సంతోష్ కుమార్ కు కేసీఆర్ తన రాజకీయ పార్టీ తరపున రాష్ట్ర స్థాయి కమిటీలో పట్టం కట్టడమే కాకుండా రాజ్యసభ ఎంపీ కూడా ఇచ్చారు. ప్రస్తుతం ప్రగతిభవన్లో సంతోష్ కుమార్దే అధిపత్యం. సంతోష్ అంశంలో కేసీఆర్ కుటుంబంలో కూడా గొడవలు జరిగాయని గతంలో ప్రచారం జరిగిందే.





# ఫ్యామిలీ ప్యాక్

## బీఆర్ఎస్ లోకి మరో వారసుడు

### మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇంచార్జీగా తొలి నియామకం

### 2009లోనే పాలిటిక్స్ లోకి కల్వకుంట్ల వంశీధర్రావు

### సిద్ధిపేట నుంచి పోటీకి దింపుతారని ప్రచారం...

**విశాలభారతి స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ ఉన్నతాధికారుల బదిలీలు, రెవిన్యూ అంశాలన్నీ సంతోష్ దగ్గరుండి చూస్తారని ప్రగతి భవన్ వర్గాల్లోనే టాక్. ఈ నేపథ్యంలో కేసీఆర్ కుటుంబం నుంచి మరో నాయకుడు వచ్చినట్లయింది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్లోకి కేసీఆర్ అన్న కుమారుడు మళ్లీ మెరుపులా వచ్చాడు.2009లోనే రాజకీయాల్లోకి వచ్చినా.. ఇప్పటి వరకు కొన్ని పైరవీలకే పరిమితమైనట్లు ప్రచారం జరుగుతున్నది. తాజాగా ఇప్పుడు బీఆర్ఎస్కు కీలక పదవిలోకి వచ్చారు. బీఆర్ఎస్ విస్తరణ తర్వాత రాష్ట్ర రాజకీయాలతో పాటుగా పక్క రాష్ట్రాలపై కన్నేసిన కేసీఆర్.. ప్రధానంగా మహారాష్ట్రను టార్గెట్ చేశారు. ఇక్కడ ఇప్పటికే చాలా సమావేశాలు నిర్వహించారు. ఎంతమంది వచ్చినా పార్టీలోకి పెద్ద ఎత్తున కార్యక్రమం పెట్టి ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన కొంతమంది మంత్రులు, నేతలను మహారాష్ట్రపైనే ఫోకస్ పెట్టాలని ఆదేశించారు.

**ఒకే కుటుంబం నుంచి కీలకంగా ఆరుగురు**

కల్వకుంట్ల వంశం నుంచి నాలుగో వ్యక్తిగా వంశీధర్ రావు యాక్టివ్ పాలిటిక్స్ లో నిలిచారు. ప్రస్తుతం కేసీఆర్, కేటీఆర్, కవిత కొనసాగుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కాగా, కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, ఐటీ శాఖ మంత్రిగా ఉన్నారు. కేసీఆర్ కూతురు కవిత ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. మొత్తంగా రాఘవరావు ఫ్యామిలీ నుంచి చూస్తే కేసీఆర్ మేనల్లుడు హరీశ్ రావు వైద్య ఆరోగ్య, ఆర్థికశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. అప్పుడు ఆ కుటుంబ సభ్యుల సంఖ్య ఐదుకు చేరుతుంది. సీఎం కేసీఆర్ సడ్డకుడి(తోడల్లుడి) కుమారుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రస్తుతం రాజ్యసభ

..మిగతా 2 లో

### మహారాష్ట్రకు చీఫ్

తాజాగా మహారాష్ట్రకు స్టీరింగ్ కమిటీని ప్రకటించిన కేసీఆర్.. చైర్మన్గా వ్యవహరిస్తుండగా, 14 మందిని స్టీరింగ్ కమిటీ సభ్యులుగా నియమించారు. కానీ, ఇదే సమయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీగా కల్వకుంట్ల వంశీధర్రావు వ్యవహరిస్తారని ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ జాతీయ కార్యదర్శి హిమాన్షు తివారీ పేరుతో ప్రకటన విడుదల చేశారు. అంతేకాకుండా మహారాష్ట్రలోని ఆరు డివిజన్లకు కో ఆర్డినేటర్లు, కో కో ఆర్డినేటర్లను సైతం ప్రకటించారు. వీరందరికీ చీఫ్గా కల్వకుంట్ల వంశీధర్రావు వ్యవహరించనున్నారు.



## గోదావరి మహోగ్రరూపం

### క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం

### భద్రాచలం వద్ద 52.1 అడుగుల వద్ద ప్రవాహం

### 4,900 మంది పునరావాస కేంద్రాలకు తరలింపు

**విశాలభారతి,హైదరాబాద్:** గోదావరి నది మహోగ్రరూపం దాల్చింది. క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 7గంటలకు గోదావరి నీటిమట్టం 52.1 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. ఇప్పటికే భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం 53 అడుగులకు చేరితే అధికారులు మూడో(చివరి) ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. భద్రాచలంతో పాటు లోతట్టు గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటి

..మిగతా 2 లో

### కేసీఆర్ మిస్సింగ్ .. రేవంత్ మిస్సింగ్

## పోటాపోటీ పోస్టర్లు

**విశాలభారతి,హైదరాబాద్:** ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని పార్టీల సోషల్ మీడియా వింగ్ లు అలర్ట్ అయ్యాయి. ఆయా పార్టీలకు ఫుల్ హైప్ ఇవ్వడంతో పాటు ప్రత్యర్థి పార్టీల నేతలపై తప్పుడు ప్రచారం చేయడంలో ఐటీ వింగ్స్ పోటీ పడుతున్నాయి. రేవంత్ రెడ్డి కనిపించడం లేదంటూ మల్కాజిగిరి నియోజకవర్గంలో పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. బీజేపీ ఐటీ వింగ్ ఈ పోస్టర్లను వైరల్ చేస్తున్నదన్న ఆరోపణలున్నాయి. కాసేపటికే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా.. సీఎం కేసీఆర్ మిస్సింగ్ అంటూ పోస్టర్లు వేసి.. వాటిని ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేసి ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ లిస్టులోకి భారతీయ జనతా పార్టీ కూడా చేరింది. కేసీఆర్ పోస్టర్ పెట్టి.. మిస్సింగ్ అని ప్రకటించింది.






## ఇదేనా ఇస్తాంబుల్, వాషింగ్టన్

### హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం చేస్తామన్నారు

### ఎంత సేపూ ఆ నగరాలేనా అభివృద్ధి

### కేసీఆర్పై కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఫైర్

**తెలంగాణ బ్యూరో-విశాల భారతి:** ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండే మూడు నెలలు అయినా హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోవాలని రానున్న రోజుల్లో నగర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్లో కనీస సౌకర్యాలు కల్పించలేని బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగాల్సిన అవసరం ఉందని ఆయన ఆరోపించారు. అంబర్పేట్ పటేల్ నగర్ నుంచి మూసారాంబాగ్ బ్రిడ్జి వరకు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కిషన్ రెడ్డి.. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ నగరవాసులకు కనీస సౌకర్యాలు కల్పించలేనటువంటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చక.. తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ వరదలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గత కొన్నేళ్లుగా చిన్నపాటి వర్షానికే భాగ్యనగర వాసులు ఉలిక్కిపడే పరిస్థితి ఏర్పడిందని

..మిగతా 2 లో

## తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు అదనపు జడ్జిల నియామకం

**-రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ**

**తెలంగాణ బ్యూరోవిశాల భారతి:** తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ న్యాయవాదులైన జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ అనిల్కుమార్ జూకంటిలతో పాటు జ్యుడీషియల్ అధికారిణి సుజనను హైకోర్టు అదనపు జడ్జిలుగా నియమించినట్టు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్మేఘ్వాల్ వెల్లడించారు. ఇటీవల వీరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేయగా.. తాజాగా కేంద్రం వీరి నియామకాన్ని నోటిఫై చేసింది. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ మరో ఇద్దరు తన సహచర సీనియర్ జడ్జిలను సంప్రదించి తర్వాత గతేడాది అక్టోబర్ 23న ఈ ముగ్గురి పేర్లను సిఫారసు చేశారు.





## మణిపూర్ ఘటనపై 'ఇండియా' నిజనిర్ధారణ కమిటీ..

వివరాలు 2 లో

- 20 మంది ఎంపీల ఎంపిక
- ఎన్నో రోజులుగా రాష్ట్రంలో గొడవలు.. 29న కమిటీ పర్యటన

### అభిషేక్, కవిత, నళిని

## పిటిషన్లపై జవాబివ్వండి

**-ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం**

**న్యూఢిల్లీవిశాల భారతి:** తన భార్యను ఈడీ ఆఫీసుకు పిలవడంపై తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమనూ ప్రశ్నించడంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల

..మిగతా 2 లో



# వరద ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**తెలంగాణ బ్యూరో- విశాల భారతి:**

తెలంగాణలో వరద బాధితుల సాయం కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈనెల 31వ లోగా పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తెలంగాణలో గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదలపై ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ చెరుకు సుధాకర్ వేసిన పిటిషన్ పై శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు భయాందోళనలతో ఉన్నారని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వరదల్లో ఎంతమంది మరణించారు ?, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించారా ?, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారా? లేదా ? అనే విషయాలను నివేదిక ద్వారా తెలిపాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. పునరావాస కేంద్రాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించారు, వరదలపై పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉంది, సాయం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారా, డ్యామ్ పరిరక్షణ చట్టానికి అనుగుణంగా చర్యలు చేపట్టారంటూ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షంను హైకోర్టు కురిపించింది.



# గోదావరి మహోగ్రరూపం

**మొదటిపేజీ తరువాయి**

వరకు 49 పునరావాస కేంద్రాలకు 4,900 మందిని తరలించినట్టు అధికారులు తెలిపారు. గోదావరి నీటి మట్టం పెరగడంతో స్నానఘట్టాల ప్రాంతం మొత్తం వరదనీటిలో మునిగింది. గోదావరి ఒడ్డుకు ఎవరూ వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రాచలం నుంచి సమీప మండలాలైన దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం, ముంపు మండలాలైన కోనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి నీటిమట్టం 56 నుంచి 58 అడుగులకు చేరే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు.

# ఫ్యామిలీ ప్యాక్

**మొదటిపేజీ తరువాయి**

ఎంపీగా ఉన్నారు. ఆయనను కూడా కలుపుకొంటే కేవలం ఒక్క కుటుంబానికి చెందిన వారే ఆరుగురు బీఆర్ఎస్ పాలిటిక్స్ లో ఉన్నట్టు లెక్క.

**రంగారావు ఫౌండేషన్ తో సేవా కార్యక్రమాలు**

కేసీఆర్ తండ్రి కల్వకుంట్ల రాఘవరావుకు ఇద్దరు కుమారులు, తొమ్మిది మంది కుమార్తెలు. పెద్ద కుమారుడు రంగారావు, చిన్నకొడుకు కేసీఆర్.. రంగారావుకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. వాళ్లే కల్వకుంట్ల వంశీధర్ రావు, కన్నారావు, రమ్యారావు. కేసీఆర్ కు ఒక కుమారుడు, ఒక కూతురు. వాళ్లే కే తారకరామారావు, కవిత. కల్వకుంట్ల వంశీధర్ రావు చిరంజీవికి వీరాభిమాని.. ఆయన ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. పీఆర్పీ నుంచి టికెట్ ఆశించిన వంశీధర్ రావుకు దక్కలేదని తెలుస్తోంది. రంగారావు కూతురు రమ్యారావు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఆమె కేసీఆర్ పాలనపై విమర్శలు సంధిస్తున్న విషయం తెలిసిందే. కన్నారావు పాలిటిక్స్ లో పెద్దగా యాక్టివ్ గా లేరనే చెప్పాలి.

# మణిపూర్ ఘటనపై 'ఇండియా' నిజనిర్ధారణ కమిటీ..

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో ఈ ఏడాది మే 3 నుంచి రెండు తెగల మధ్య హింసాకాండ జరుగుతోంది. మైదాన ప్రాంతానికి చెందిన మైతేయ్‌లకు ఎస్టీ హోదా కల్పించడంపై అక్కడి కూకీలు ఆందోళన బాటపట్టారు. చివరకు ఇరు వర్గాల మధ్య గొడవ రాష్ట్రం తగలబడిపోయే వరకు వచ్చింది. కూకీల మహిళలపై చేస్తున్న దారుణాలు వెలుగులోకి రావడంతో దేశంతో పాటు యావత్ ప్రపంచం దిగ్భ్రాంతి చెందింది. మణిపూర్‌లో హింస చెలరేగిన 79 రోజుల తర్వాత గానీ పీఎం నరేంద్ర మోడీ స్పందించలేదు.

ఇక పార్లమెంటులో కూడా మణిపూర్ అంశమే కీలకంగా మారింది. అక్కడ జరుగుతున్న హింసపై పార్లమెంటులో చర్చించాలని విపక్షాలు పట్టుబట్టడంతో ఉభయ సభల్లో గందరగోళం నెలకొన్నది. శుక్రవారం కూడా ఈ విషయంపై ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. మణిపూర్ హింసపై చర్చకు అనుమతించక పోవడంపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. పార్లమెంట్ ప్రారంభమైన రోజు నుంచి ప్రతిపక్షాలు ఇదే అంశంపై ప్రధాని మోడీని ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కీలక నిర్ణయం తీసుకున్నది.

ఈ నెల 29, 30న మణిపూర్‌కు ఒక నిజనిర్ధారణ కమిటీని పంపాలని నిర్ణయించింది. ఇందుకు ఇండియా కూటమిలోని పలు పార్టీలకు చెందిన 20 మంది ఎంపీలను ఎంపిక చేసింది. ఈ బృందం రెండు రోజుల పాటు మణిపూర్ రాష్ట్రంలో పర్యటించనున్నది. మైదాన ప్రాంతంతో పాటు పర్వత, లోయ ప్రాంతాల్లో కూడా ఈ నిజ నిర్ధారణ బృందం పర్యటిస్తుంది. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు, నాయకులతో భేటీ కానున్నది. అలాగే పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడి వాస్తవ పరిస్థితులను బృందం తెలుసుకుంటుంది.



**ఇండియా ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులు..**

1. అధిర్ రంజన్ చౌదరి కాంగ్రెస్
2. గౌరవ్ గొగొయ్ కాంగ్రెస్
3. రాజీవ్ రంజన్ (లలన్ సింగ్) జనతాదళ్ (యూ)
4. సుస్మితా దేవ్ తృణమూల్ కాంగ్రెస్
5. కనిమొళి కరుణానిధి డీఎంకే
6. సందోశ్ కుమార్ సీపీఐ
7. ఏఏ రహీమ్ సీపీఎం
8. ప్రొఫెసర్. మనోజ్ కుమార్ ఝా ఆర్జేడీ
9. జావేద్ అలీ ఖాన్ సమాజ్ వాది పార్టీ
10. మహువా మజీ జార్ఖండ్ ముక్తి మోర్చ
11. పిపి. మహ్మద్ ఫైజల్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ
12. అనీల్ ప్రసాద్ హేగ్డే జనతాదళ్ (యూ)
13. ఈటీ. మహ్మద్ బషీర్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్
14. ఎన్‌కే. ప్రేమ చంద్రన్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ
15. సుశీల్ గుప్తా, ఆమ్ ఆద్మీ పార్టీ
16. అరవింద్ సావంత్, శివసేన
17. డి. రవికుమార్, విడుతలై చిరుతైగల్ కచ్చి (వీసీకే)
18. తిరు తోల్ తరుమవలవన్, వీసీకే
19. జయంత్ సింగ్, రాష్ట్రీయ లోక్ దళ్
20. ఫులో దేవి నేతమ్, కాంగ్రెస్

# ఇదేనా ఇస్తాంబుల్, వాషింగ్టన్

**మొదటిపేజీ తరువాయి**

ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం చేస్తామని.. ఇస్తాంబుల్, డల్లాస్, వాషింగ్టన్ చేస్తామని అనేక రకాల ప్రకటనలు చేశారని గుర్తు చేశారు. కానీ కింది స్థాయిలో ఏ రకమైన మార్పు లేదని, ట్యాంక్ బండ్‌లోని మురికినీరు తీసేసి.. కొబ్బరి నీళ్లు నింపుతానని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇలా చెప్పుకుంటూ పోతే మంచినీటి సమస్య, ఓట్ల సమస్య, వీధి దీపాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేనటువంటి ఎన్నో సమస్యలు విశ్వనగరంలోనే ఉన్నాయని మండిపడ్డారు.



**ఎంతసేపూ ఆ నగరాలేనా అభివృద్ధి :**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతసేపు హైటెక్ సిటీ, కొండాపూర్ , మాదాపూర్ లలో ఫ్లై ఓవర్లు, స్కై ఓవర్లు ఏర్పాటు చేయడం కాదని.. వాటికి రకరకాల రంగులు పూసి అభివృద్ధి చేస్తున్నామని చెప్పడం తప్ప ఏం చేశారో చెప్పాలని కిషన్‌రెడ్డి నిలదీశారు. హైదరాబాద్‌లో పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే పాతబస్తీ వాసులపై ప్రభుత్వం కుట్రపూరితంగా కక్షగట్టినట్లు వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. అంతకుముందు యూసుఫ్‌గూడ డివిజన్‌లోని వెంకటగిరిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కిషన్‌రెడ్డి పర్యటించారు. పొంగిపొర్లుతున్న నాలాలను పరిశీలించారు. వాటి పరిస్థితిపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి.. సమస్య తీవ్రతను వివరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర ఆదేశాలతో అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.



**అభిషేక్, కవిత, నళిని**

# పిటిషన్లపై జవాబివ్వండి

**మొదటిపేజీ తరువాయి**

కవిత, నళినీ చిదంబరం కూడా గతంలో పిటిషన్లు దాఖలు చేశారు. అభిషేక్, కవిత, నళిని పిటిషన్లపై 6 వారాల్లో జవాబివ్వాలని సుప్రీంకోర్టు ఈడీని ఆదేశించింది. 3 పిటిషన్లను కలిపి విచారిస్తామని స్పష్టం చేసింది. అభిషేక్ భార్యపై లుక్‌అవుట్ నోటీసును వెనక్కి తీసుకుంటున్నామని ఈడీ కోర్టుకు తెలిపింది. అసలు లుక్‌అవుట్ నోటీసులు ఎందుకు ఇచ్చారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రిజిస్ట్రీతో మాట్లాడి విచారణపై సోమవారం నిర్ణయిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. మహిళలను ఈడీ ఆఫీసుకు పిలవడంపై తర్వాత విచారిస్తామని తెలిపింది.







# వరద బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటాం

- మృతి చెందిన వారి కుటుంబాలకు 4 లక్షల ఎక్స్ గ్రేషియ
- తక్షణ సాయం కింద 25 వేల మంజూరు
- జిల్లాలో ఎనిమిది మంది మృతి
- మంత్రి సత్యవతి రాథోడ్

**ములుగువిశాలభారతి:**ములుగు జిల్లాలో పడినంత వర్షం చరిత్రలో ఎప్పుడు చూడలేదని ,వరద బాధితులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి వర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్&బి గెస్ట్ హౌస్ లో ములుగు జిల్లా ఇంఛార్జి ప్రత్యేక అధికారి యస్.క్రిష్ణ ఆదిత్య, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంఛార్జి ప్రత్యేక అధికారి గౌతమ్ పొట్రూ, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో 70 సెంటీమీటర్లు పైగా భారీ వర్షపాతం నమోదయిందని, ఇప్పటివరకు జిల్లాలో 8 మంది మృత్యు వాతపడ్డారన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరువంచ గ్రామంలో ముగ్గురు వ్యక్తులు నీటి ప్రభావంలో కొట్టుకపోయారని, రెండు జిల్లాలలో వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించమన్నారు నీటిలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక హెలికాప్టర్ కేటాయించారని,బాధితులకు ఆహారం,మంచినీరు అందిస్తున్నామన్నారు. ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో 80 మంది గ్రామస్తులు నీటిలో చిక్కుకున్నారని వారికి హెలికాప్టర్ ద్వారా బాధితులకు ఆహారం,మంచినీరు అందించడం జరుగుతున్నదని హెలికాప్టర్ ద్వారా బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఎమర్జెన్సీ వైద్య సేవలు అందిస్తున్నమన్నారు.ఎవరు ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను కాపాడడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మృతి చెందిన బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయల పరిహారం అందించడం జరుగుతుందని, అన్ని విధాలుగా నష్టపోయిన వారికి కుటుంబాలకు 25 వేల రూపాయలను తక్షణమే అందించడం జరుగుతుందన్నారు.ఏటూరునాగారం సమీపంలోని రామన్నగూడెం వద్ద గల పుష్కర ఘాటు వద్ద గతంలో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని, ప్రస్తుతం 18 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నదన్నారు.జిల్లాలో 27 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆయా కేంద్రాలను వెయ్యికి పైగా బాధితులు ఉన్నారని,రానున్న రోజులలో ఇలాంటి ప్రాణనష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపలు పట్టేందుకు చెరులో దిగే మత్స్యకారులపై కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. కూలిపోయే ప్రమాదకరంగా ఉన్న రోడ్ల రాకపోకలను నిలిపివేశామని, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే వరదలు తగ్గలేదో తగ్గిన వెంటనే, మరమ్మత్తులు చేయలన్నారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ కోటి రూపాయలను మంజూరు చేశారని,పకృతి బీభత్సం కాబట్టి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నారు.

**వర్షాలతో ప్రజలు కష్టాలు పడుతుంటే..**

# కేసీఆర్ ఎన్నికల గురించి ఆలోచిస్తున్నారు

- ఐఎండీ హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం అప్రమత్తం కాలేదు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

**హైదరాబాద్‌విశాల భారతి:** రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల అనేక జిల్లాలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. వరంగల్ పట్టణంలో దారుణ పరిస్థితులు ఉన్నాయని వివరించారు. నగరంలోని 150 కాలనీలు నీట మునిగిపోయాయని తెలిపారు. ఈ క్రమంలోనే వరంగల్‌ను ఎంతో అభివృద్ధి చేశామని ప్రభుత్వం చెబుతుంటుందని.. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తే వరంగల్ ఎందుకు నీట మునిగిందని ప్రశ్నించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. వరంగల్‌ను డల్లాస్, సింగపూర్ చేస్తామని.. కేసీఆర్ గొప్పలు చెప్పారని డీకే అరుణ గుర్తు చేశారు. మరి అవి ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దిక్కుతోచని స్థితిలో రైతులు, ఇళ్లలోని ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. వాళ్ల కష్టాలు చూస్తే కన్నీళ్లు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 40,000 కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డునపడ్డాయని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు వర్షాలపైన సమీక్ష చేయలేదని డీకే అరుణ విమర్శించారు. వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదని డీకే అరుణ మండిపడ్డారు.

# ఐజిబిసి గ్రీన్ ప్రాపర్టీ షో సందడి షురూ

**హైదరాబాద్, విశాలభారతి:**

హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా మొట్ట మొదటి సారిగా గ్రీన్ ప్రాపర్టీ షోను ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజిబిసి) ప్రాతినిధ్యం వహించింది. ఈ ప్రాపర్టీ షోను మంత్రి కెటి రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీతో పాటు, సిఐఐ తెలంగాణ చైర్మన్ మరియు ఐజిబిసి, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కోఛైర్మన్ జి. శ్రీనివాస మూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్. వెంకటగిరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎం ఆనంద్, రియల్ ఎస్టేట్ పరిశ్రమ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, గ్రీన్ ఉత్పత్తి తయారీదారులు పాల్గొన్నారు.

ఐజిబిసి తొలి ఎడిషన్ గ్రీన్ ప్రాపర్టీ షో ద్వారా సాంప్రదాయ భవనాల కంటే ఐజిబిసి సర్టిఫైడ్ లేదా ప్రీసర్టిఫైడ్ గ్రీన్ ప్రాజెక్ట్‌లు, టెక్నాలజీ, సేవలతోపాటు పర్యావరణ చైతన్యం కలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యంతో చేపట్టారు. ఈ ఎక్స్‌పోలో గ్రీన్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీస్, బిల్డింగ్, ప్రొడక్ట్స్, సర్వీస్‌లను 75కు పైగా స్టాళ్లలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సిఐఐ తెలంగాణ చైర్మన్, ఐజిబిసి హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ... "గ్రీన్ ప్రాపర్టీ షో ద్వారా ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వద్ద గ్రీన్ సర్టిఫైడ్ మరియు ప్రీసర్టిఫైడ్ ప్రాజెక్ట్‌లతో పాటు పర్యావరణ అనుకూల ఉత్పత్తులను తీసుకురావటం జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న డెవలపర్లు, ప్రకృతి ప్రేమికులను ఏకం చేయడంలో ఈ ప్రాపర్టీ షో ఎంతగానో సహకరిస్తుంది. దూరదృష్టి కలిగిన ప్రభుత్వ నాయకత్వంలో పర్యావరణహిత అనుకూల పద్ధతులను అవలంభించి హరిత భవనాల నిర్మాణాలను ప్రోత్సహిస్తుంది. సాంప్రదాయక భవనాల కంటే గ్రీన్ రేటెడ్ ప్రాజెక్ట్‌ల ప్రాముఖ్యతపై మరింత అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఆర్థికంగా, సాధారణ ఆరోగ్య సుస్థిరతకు తోడ్పడుతుంది. సహజ వనరులను పరిరక్షించడం, పర్యావరణ ప్రభావాలను తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తుంది. అదనంగా, గ్రీన్ బిల్డింగులను ఎంచుకొనే కొనుగోలుదారులు, డెవలపర్‌లకు గృహరుణాలపై తక్కువ వడ్డీ రేట్లు వంటి ఆర్థిక ప్రోత్సాహకాలు అందుతాయి." అని అన్నారు.

**సందడి చేసిన ఏకో ఫ్రెండ్లీ భవనాలు**

దేశంలోనే హైదరాబాద్ లో తొలిసారిగా ఏర్పాటు చేసిన గ్రీన్ ప్రాపర్టీ షోలో ఏకో ఫ్రెండ్లీ భవనాలు సందడి చేశాయి. సిటీ కేంద్రంగా నిర్మాణంలో ఉన్న పర్యావరణహితమైన ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ముఖ్యంగా వాసవి గ్రూప్, ఆర్క్, అపర్ణ, సుచిరిందియాతోపాటు పలు నిర్మాణ సంస్థల ప్రొడక్టులను ప్రదర్శించాయి.

పచ్చదనానికి తెలంగాణ ప్రాధాన్యత : కేటీఆర్ గ్రీన్ బిల్డింగ్, గ్రీన్ హోమ్, గ్రీన్ ఎయిర్‌పోర్టు వంటి నిర్మాణాలతో దేశానికి తెలంగాణ గర్వకారణంగా నిలుస్తుందనీ మంత్రి కేటీఆర్ తెలిపారు. సచివాలయం, జిల్లా కలెక్టరేట్లను గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌లో నిర్మించామని, గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉండటంపై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సీఐఐ ఐజీబీసికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. గ్రీనరీ ఇంప్లిమెంట్ చేయడం ద్వారా తెలంగాణ పచ్చని బాటలో నడుస్తోందని మంత్రి కేటీఆర్ చెప్పారు. భవనాలు, క్యాంపస్‌లు మాత్రమే కాకుండా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లలో ఐజీబీసి ద్వారా గ్రీన్ సిటీస్ రేటింగ్ పెరుగుతోందన్నారు. తెలంగాణకు హరిత హారం ద్వారా రాష్ట్రంలో పచ్చదన విస్తీర్ణం 24% నుంచి 33% శాతం వరకు పెరిగిందన్నారు. నగరాలతో పాటు రాష్ట్రంలోని గ్రామాల్లోనూ గ్రీన్ బిల్డింగ్ సూత్రాలను పాటిస్తున్నారనీ, గంగదేవిపల్లి స్ఫూర్తిగా రాష్ట్రంలోని వెయ్యి గ్రామాలను గ్రీన్ విలేజెస్‌గా మార్చేందుకు ఐజీబీసీ సహకరించాలన్నారు. గ్రామాలు పర్యావరణ హితంగా మారడానికి వీలుగా పటిష్టమైన మౌలిక సదుపాయాల కల్పనపై తాము దృష్టి పెడుతున్నామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.
















# ఎన్నికలవేళ నాయకుల పోటాపోటీ సేవా కార్యక్రమాలు

**వరద బాధితులను ఆదుకునేందుకు కదిలిన నాయకగణం**







**షాద్ నగర్ - విశాలభారతి:** ఎడతెరిపి లేని వర్షాలతో గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఇల్లు నేలమట్టమై ప్రజలు అల్లాడుతున్నారు. జనాలను ఆదుకునేందుకు అన్ని పార్టీల నాయకులు సాయం చేసేందుకు పోటీపడుతున్నారు. తమవంతుగా సాయం చేస్తూ ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

షాద్ నగర్ నియోజకవర్గంలో ముందుగా ముందడుగు వేసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఇల్లు కూలిన బాధిత కుటుంబాలకు 25వేల రూపాయల నుండీ 10వేల రూపాయల చొప్పున సాయం అందిస్తున్నాడు. నియోజకవర్గ పరిధిలోని ఫరూక్ నగర్, కేశంపేట, నందిగామ, కొత్తూరు, చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి ఇల్లు కూలిన బాధితులతో మాట్లాడి తక్షణ సాయాన్ని అందించారు. జరిగిన నష్టాన్ని బట్టి రూపాయలు పది నుంచి 25 వేలు సాయం అందించారు.

నియోజకవర్గంలో మొదటి నుండి వీర్లపల్లి శంకర్ ఆపదలో వున్నవారికి తనవంతు సాయం అందిస్తూ వస్తు తన ఉదారత్వాన్ని చాటుకుంటున్నాడు. ఇప్పుడు ఆ కోవలోనే మిగతా నాయకులు కూడా వెళ్తున్నారు. ఇదే బాటలో బిజెపి నేత పాలమూరు ట్రస్ట్ చైర్మన్ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి కూడా అడుగు ముందుకు వేశారు. బాధిత కుటుంబాలకు ఒక్క కుటుంబానికి తక్షణసాయంగా 5వేల రూపాయలు అందించేందుకు ఆయన ముందుకు వచ్చారు. నియోజకవర్గంలో మొత్తం 50 ఇండ్లకు బాధితులు ఒక్కొక్కరికి 5వేల చొప్పున ఆయన పంపిణీ చేయడం విశేషం. అంతేకాకుండా నాయకులు ఎవరూ ఇళ్లల్లో కూర్చోవద్దని బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు అధికార పార్టీ నుంచి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకోవడమే కాకుండా ఇల్లు కూలిన వారికి భరోసా కల్పిస్తూ గృహలక్ష్మి పథకం కింద ఒక్కో కుటుంబానికి మూడు లక్షల రూపాయల చొప్పున అందించేందుకు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు అప్రమత్తంగా ఉండి సమస్యలు తన దృష్టికి తేవాలని, అవసరమైతే తాము కూడా స్వయంగా వారికి సహకారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. నాయకులంతా ఒక్కొక్కరు ఒక్కో పార్టీ నుంచి ముందడుగు వేసి వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తుండటం అభినందనీయం.

**ఇదే ట్రెండ్ కొనసాగుతుందా ఎన్నికల వరకే పరిమితమా?**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. అదికూడా నాయకులు ఈ ట్రెండ్ కొనసాగించేందుకు కారణమా లేక ఇది నిరంతర ప్రకియ అని గ్రామాల్లో ప్రజలు అనుకుంటున్నారు. ఎన్నికల వరకే కాకుండా ఆపదలో వున్నవారిని ఆదుకునే ఈ కార్యక్రమం ఇలాగే కొనసాగిస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

ఎన్నికలకు ముందు హడావుడిగా ఇలా వ్యవహరించినట్టు కాకుండా మిగతా సమయంలో కూడా అన్ని పార్టీల నాయకులు ఇలాంటి సేవాకార్యక్రమాలు చేపడితే బాగు. ఇది ఎన్నికల వరకే కొనసాగిస్తే ప్రజలకు నాయకుల వ్యవహారశైలిపై తప్పుడు అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంటుంది. చూడాలి నాయకులు ఈ ట్రెండ్ కొనసాగిస్తారా? ఎన్నికల వరకే ముగిస్తారో.



# దైద రవీందర్ నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలి

- కష్ట కాలంలో కార్యకర్తలను ఆదుకున్న నాయకుడు దైద
- నకిరేకల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
- ముక్తకంఠంతో నినదించిన చిట్యాల మండల కాంగ్రెస్ నాయకులు

**చిట్యాల, విశాలభారతి:** నకిరేకల్ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా దైద రవీందర్ పేరుని ప్రకటించాలని చిట్యాల మండల కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు.

చిట్యాల మండల కేంద్రంలో దైద రవీందర్ ని నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జ్ గా నియమించి ఎమ్మెల్యే టికెట్ ఇప్పించాలని కోరుతూ వివిధ గ్రామ శాఖ కమిటీలు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందం గా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు నీలకంఠం లింగ స్వామి, బోయపల్లి వెంకన్న గౌడ్, నాగంపల్లి కిషోర్, చెరుకు సైదులు మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు వెన్నుదన్ను గా నిలుస్తూ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తలను కాపాడుకుంటూ వస్తున్న విద్యావంతుడు అయిన దైద రవీందర్ ని నియోజకవర్గ ఇన్చార్జ్ గా ప్రకటించి రాబోయే ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి లని ఒక ప్రకటనలో కోరారు. పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆశీస్సులతో నకిరేకల్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగురుతుందని భారీ మెజార్టీతో గెలుస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. నియోజకవర్గానికి సంబంధాలు లేని కొంత మంది నాయకులు ఇక్కడ ఎన్నికలకు ముందు వచ్చి హడావుడి చేసి మాయమైపోతారు కానీ దైద రవీందర్ స్థానిక నాయకుడు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ స్థానిక సమస్యల మీద నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు నమ్మకం కల్పిస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. వనిపాకల మాజీ సర్పంచ్ కట్టంగూరి మల్లేష్, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, వార్డు మెంబర్లు మామిడి నాగేష్, ఓర్సు శ్రీను, ఉపాధ్యక్షులు నందిపాటి మహేష్, శ్రవణ్, మెట్టు అశోక్, ఉమర్, కొండ శేఖర్, కేకే చారీ, యూత్ అధ్యక్షులు నకిరేకల్ నియోజకవర్గం, నాయకులు పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజి విద్యార్థులకు హాస్టల్ మంజూరు



**నార్కట్ పల్లి, విశాలభారతి:** నార్కట్ పల్లి జూనియర్ కాలేజి విద్యార్థులకు హాస్టల్ ను మంజూరు చేయించినట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సరం నూతనంగా ఏర్పాటైన జూనియర్ కాలేజి విద్యార్థుల సౌలభ్యం కోసం మండల కేంద్రంలో బిసి హాస్టల్ ను మంజూరు చేసినట్లు తెలిపారు. బిసి విద్యార్థులతో పాటు ఎస్సి, ఓసి విద్యార్థులకు కూడా రిజర్వేషన్ల వారీగా సీట్లను కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం నుండి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని మండల పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## ప్రజా సమస్యలపై పోరాటమే పిఆర్ పిఎస్ లక్ష్యం

- నూనె వెంకట్ స్వామి
- పిఆర్పిఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన వెంకటస్వామి

**రామన్నపేట, విశాలభారతి:** ప్రజా సమస్యలపై పోరాటమే పిఆర్పిఎస్ లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి అన్నారు. రామన్నపేట పట్టణ కేంద్రంలో పిఆర్పిఎస్ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ కార్మిక, కర్శక, ఉద్యోగ, మహిళా, యువజన, విద్యార్థి, మేధావి సకల ప్రజల యొక్క పిఆర్పిఎస్ మండల కార్యాలయం నాందీ వాచకం కావాలని, వాటన్నిటికీ కాలసిన ప్రజా మద్దతును, బలం, బలగాన్ని మరింత సమీకరించడానికి ప్రజా కేంద్రాలుగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు వరికల్ గోపాల్, నాయకులు నన్నూరి శంకరరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి కాడయ్య, ఉయ్యాల లింగస్వామి, మహేశ్వరం సుధాకర్, చిట్టిమళ్ళ శ్రవణకుమార్, పట్టెడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అతివృష్టి వరదల వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య.



**బయ్యారం, విశాలభారతి:** గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వలన తెలంగాణ రైతాంగం అతలాకుతలమయ్యారు. వాగులు, చెరువులు భారీగా ఉప్పొంగడంతో లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయ్యాయి. లక్షలాది ఎకరాల పంట పొలాలు రోజుల తరబడి నీట మునిగి కుళ్ళిపోయాయి. పైర్లన్ని వరదలకు కొట్టకపోవడమే కాకుండా పొలాలు కోతకు గుర్రై ఇసుక మేటలు వేసి వేలాది ఎకరాలు సేద్యానికి పనికిరాకుండా పోయాయని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ఇప్పుడప్పుడే తగ్గే సూచనలు కనిపించడం లేదని అన్నారు. మంత్రులు ప్రజా ప్రతినిధులు అరకొర ప్రకటనలు, పైపై ఆర్భాటాలు తప్ప నష్టపోతున్న రైతాంగం గురించి ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. ఇంతవరకు వ్యవసాయ శాఖ, ప్రభుత్వ యంత్రాంగం నష్టపోయిన పంటల గురించి సర్వేకు కూడా ఆదేశించలేదు. తొలకరి ప్రారంభంలోనే పైర్లన్నీ ధ్వంసం కావటంతో రైతాంగం తలలు పట్టుకొన్నారని తెలిపారు. పంటలనష్టాన్ని, వరదకు కొట్టుకుపోయి కోతకు గురైన, ఇసుక మేటలు వేసిన భూముల సర్వేకు ఆదేశించాలని నష్టపోయిన ప్రతిరైతుకు పరిహారం అందించి ఆదుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## పలువురిని పరామర్శించిన అంతటి పారిజాత నరసింహ

**చిట్యాల, విశాలభారతి:** వెలిమినేడు గ్రామానికి చెందిన అంతటి లక్ష్మమ్మ కొద్ది రోజుల క్రితం మృతి చెందడం జరిగింది. వారి సంతాప సభ కార్యక్రమాని కి హాజరైన అంతటి పారిజాత నరసింహా గౌడ్ లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గోలి గణేష్, కర్దురి మల్లారెడ్డి, మారగోని యాదయ్య, గోలి మహేష్, అంశల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రంధాలయానికి చేయూత

**కోదాడ, విశాలభారతి:** గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల సౌకర్యార్థం స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ వారు సీలింగ్ ఫ్యాన్లు, మినరల్ వాటర్ కూలర్ వంటి మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమని గ్రంథాలయ చైర్మన్ షేక్ రహీం అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాపూజీ శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దాతలు ముందుకు వచ్చి గ్రంథాలయానికి చేయూతను అందించడం పట్ల వారు సంతోషకరం వ్యక్తం చేశారు. కేవలం విద్య ద్వారానే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలమని విద్యార్థులు దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తమ గ్రంథాలయానికి స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ వారు, దాతలు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. అనంతరం గ్రంథాలయానికి చేయూతను అందించిన దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ట్రస్టు అధ్యక్షులు గాదం శెట్టి శ్రీనివాసరావు, చారు గండ్ల రాజశేఖర్, బడుగుల సైదులు, సాంబశివరావు, పైడిమర్రి రామారావు, పందిరి సత్యనారాయణ, వెంపటి ప్రసాద్, శేషు కుమార్, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.



## పునరావాస కేంద్రాల ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి

- వరద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య

**భద్రాచలంవిశాల భారతి:** భద్రాచలం శాసనసభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు మరియు ఏఐసీసీ సభ్యులు పొదెం వీరయ్య భద్రాచలం పట్టణం అయ్యప్ప కాలనీ ముంపు వాసులను గిరిజన అభ్యుదయ భవానికి తరలించగా వారిని ఆత్మీయంగా పరామర్శించడం జరిగింది వారికి అందుతున్నటువంటి సదుపాయాల గురించి ఆరాతీస్తూ ఎటువంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని రెవెన్యూ పంచాయతీ రాజ్ ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించడం జరిగింది, ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు సభ్యులు తో జిల్లా sc సెల్ అధ్యక్షులు రవికుమార్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోగాల శ్రీనివాస రెడ్డి సరెళ్ల వెంకటేష్, తరుణ్ మిత్ర, పంబాల సరిత తదితరులు పాల్గొన్నారు.



## ముస్తాబైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

**కోదాడ విశాలభారతి:** పేదల ఆత్మగౌరవంతో జీవించేందుకు నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశానుసారం కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్ లో నిర్మించిన 560 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వారు పరిశీలించారు. అనంతరం రెండున్నర కోట్ల రూపాయలతో జరుగుతున్న డ్రింకింగ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు, మౌలిక వసతుల పనులను పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచి లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా నాణ్యతతో నిర్మించాలని అధికారులకు సూచించారు. పార్టీలకు అతీతంగా అత్యంత పారదర్శకంగా అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గౌరవ ఎమ్మెల్యే కేటాయించారని అన్నారు. అతి త్వరలోనే ఎమ్మెల్యేతో లబ్ధిదారులు అందరిచే గృహప్రవేశాలు చేయడం జరుగుతుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లతో పేదల సొంతింటి కల సహకారమైందని, ఇల్లు రానివారు నిరుత్సాహపడకుండా అందరికీ త్వరలోనే మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంపటి పద్మా మధుసూదన్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చందు నాగేశ్వరరావు డిఇ సతీష్ బాబు, కౌన్సిలర్లు కోట మధు, స్వామి నాయక్, కల్లూరి పద్మజ, కందుల చంద్రశేఖర్, మదర్, ఖదీర్ పాషా, గుండెల సూర్యనారాయణ, కట్టెబోయిన జ్యోతి శ్రీనివాస్, వంటిపులి రమా శ్రీనివాస్, అలవాల అపర్ణ వెంకట్, డాక్టర్ బ్రహ్మం, వంశీ నాని, అబిధర్ నాయుడు, ఏఇ రామ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ లకి తప్పని తిప్పలు



- సర్పంచ్ లే కార్మికులైన వేళ
- స్టీరింగ్ పట్టిన సర్పంచ్ లు
- పారిశుధ్య కార్యక్రమాలలో నిమగ్నమైన పలువురు సర్పంచ్ లు



చిట్యాల, విశాలభారతి: పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తుండటంతో సర్పంచ్ లకి తిప్పలు తప్పడం లేదు. గత కొన్ని రోజుల నుండి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల లో పనిచేస్తున్న కార్మికులు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే. కార్మికుల ధర్నా వల్ల గ్రామాలలో మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య నిర్వహణ కుంటుపడింది. ఒకవైపు కార్మికుల మరోవైపు ప్రజల నుండి విజ్ఞప్తులు ఏమి చేయలేని స్థితిలో సర్పంచ్ లున్నారు. చేసేదేమీ లేక వారే కార్మికుల పారిశుధ్య వాహనాన్ని నడుపుతూ గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో బోయపల్లి శ్రీనివాస్, సుంకేనపల్లి గ్రామంలో సర్పంచ్ కక్కిరేణి బొందయ్య లు చెత్త ట్రాక్టర్ ని నడుపుతూ కాలనీలో ఉన్న చెత్తను శుభ్రం చేయించారు. కార్మికులు సమ్మె చేస్తుండడంతో గ్రామాలలో చెత్త డ్రైనేజీలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం కార్మికుల యొక్క డిమాండ్లను పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలని ఈ సందర్భంగా సర్పంచులు కోరారు.



# ఉప్పల్ మహంకాళి అమ్మవారి బోనాల భద్రతా ఏర్పాట్లు పరిశీలన

**రాచకొండ సిపి డి.ఎస్ చౌహాన్**

**హైదరాబాద్, విశాల భారతి:** ఉప్పల్ మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా రాచకొండ సిపి డి.ఎస్ చౌహాన్ ఐపిఎస్ గారు సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. బోనాల పండుగ సమయంలో అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. సాధారణ భక్తులకు ఈసారి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలియజేశారు. మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయడానికి తగు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. షీ టీం బృందాలు కూడా మహిళా భక్తుల రక్షణ కోసం విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి డీసిపి జానకి ఐ.పి.ఎస్, ఏసిపి నరేష్ రెడ్డి, ఉప్పల్ సిఐ గోవింద్ రెడ్డి, ఇతర అధికారులు మరియు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# వర్షాల నేపథ్యంలో ప్రయాణాలు వాయిదా వేసుకోండి

- **శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ పరిశీలన.**
- **గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**బాల్కొండ, విశాలభారతి:** ఏకధాటిగా భారీ వర్షాలు కురియడంతో అనేకచోట్ల చెరువు కట్టలు తెగి రోడ్లపై నుండి వరద జలాలు ప్రవహిస్తున్న దృష్ట్యా మరో రెండు రోజుల పాటు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రజలకు హితవు పలికారు. రహదారులపై నుండి నీరు ప్రవహిస్తున్న ప్రదేశాల్లో రోడ్డును దాటే ప్రయత్నం చేయవద్దని జాగ్రత్తలు సూచించారు.మూడవ రోజు మంత్రి అధికారులతో కలిసి పోలీస్ బస్ లో ప్రయాణం చేస్తూ పలు మండలాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. పోచంపాడ్ శ్రీరామ్ సాగర్ డ్యామ్ పరిశీలనకు వెళుతూ మార్గ మధ్యలో వేల్పూర్ మండలం పడగల్ గ్రామం,బాల్కొండ మండల కేంద్రంతో పాటు వన్నెల్ బి,బోదెపల్లి,మెండోరా మండలం కోడిచెర్ల,సావెల్ గ్రామాల నాయకులను కలుస్తూ గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి నాయకులు సహాయ సహకారాలు,బియ్యం,కూరగాయలు అందించాలని సూచించారు. పోచంపాడ్ శ్రీరామ్ సాగర్ డ్యామ్ కు వరద ఎక్కువగా వస్తుండటంతో సుమారు 30 గేట్ల ద్వారా లక్ష 80వేల క్యూసెక్కుల నీరు గోదావరి లోకి వదులుతుండటంతో అధికారులతో కలిసి పరిశీలించారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుండి పెద్ద ఎత్తున ఇన్ ఫ్లో వస్తున్నందున రిజర్వాయర్ దిగువన గల దూదిగాం,సావెల్, కోడిచెర్ల,చాకిరియాల్,బట్టాపూర్,తడపాకల్,దోంచంద,గుమ్మిర్యాల తదితర పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరి నది సమీపానికి వెళ్లే సాహసం చేయవద్దని,అనవసర ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు.ఈ మేరకు ప్రజలెవరూ గోదావరి నది పరిసరాలకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మెండోరా,ఏర్గట్ల మండలాల రెవెన్యూ,పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు.ఎస్సారెస్పీకి భారీగా వరద వచ్చి చేరుతోందని, సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా రిజర్వాయర్లో 80 నుండి 82 టీఎంసీల వరకు నీరు నిలువ ఉంచుతూ,మిగితా వరద జలాలను దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు.వరద ప్రవాహం మరింతగా పెరిగినా కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదని,ఐదు లక్షల క్యూసెక్కుల వరకు నీటిని దిగువకు విడుదల చేయవచ్చని మంత్రి స్పష్టం చేశారు.గత నలభై,యాభై సంవత్సరాల కాలంలో ఏ ముఖ్యమంత్రులు కూడా ఎస్సారెస్పీని పట్టించుకోలేదని ఆక్షేపించారు.ముఖ్యమంత్రి కేసీఆర్ మొట్టమొదటిసారి ఎస్సారెస్పీ గేట్ల మరమ్మతుల కోసం రూ.22 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు.ఒకేసారి అన్ని గేట్ల మరమ్మతులు చేపట్టడం సాధ్యపడనందున విడతల వారీగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం మరో ఆరు గేట్లకు మరమ్మతులు పూర్తి కావాల్సి ఉందని,పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. వర్షాలు కొంత తగ్గుముఖం పట్టడం వల్ల వరద తీవ్రత క్రమక్రమంగా తగ్గుతోందని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు.గత మూడు రోజుల నుండి తాను క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించడం జరుగుతోందన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని,జిల్లా యంత్రాంగం యావత్తు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉందన్నారు.వరద తాకిడికి గురైన వారిని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.వర్షపు జలాల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన వసతి,సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.వర్షాల వల్ల నివాస గృహాలు దెబ్బతిన్న వారికి ఆపద్బాంధు పథకం కింద ఆదుకుంటామని,పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు.వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు,చెరువులకు తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్,ఇరిగేషన్ అధికారులను ఆదేశించామన్నారు.శాశ్వత మరమాతులకు అవసరమైన అంచనాలను సైతం రూపొందించాల్సిందిగా సూచించామని మంత్రి తెలిపారు.ప్రభుత్వపరంగా అన్ని సహాయక చర్యలు చేపడుతున్నామని,బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఎక్కడికక్కడ బాధితులను ఆదుకునేందుకు చొరవ చూపాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాధితులకు భోజన సదుపాయం ఇళ్ల మరమ్మతులకు ఆర్థిక సహకారం అందించాలని సూచించారు.



# సునీల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



**బాల్కొండ, విశాలభారతి:** భారీ వర్షాల వల్ల నిరాశ్రయులైన పేద కుటుంబాలకు బాల్కొండ కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ సూచన మేరకు భీమ్‌గల్ మండలం పిప్రి,ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ గ్రామాల్లో దాదాపు ఇరవై కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.బాల్కొండ నియోజకవర్గంలో భారీ వర్షాల నేపథ్యంలో ఏ ఒక్కరూ కూడా ఆకలితో పడుకోకూడదు అన్న ఉద్దేశ్యంతో ముత్యాల సునీల్ కుమార్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేశాన్ని రాజ్యాంగబద్ధంగా నడిపించాలి

- **మణిపూర్ లో క్రైస్తవులపై దాడులు అరికట్టాలి**
- **మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి**
- **గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ డిమాండ్**

**గరిడేపల్లి, విశాలభారతి:** మణిపూర్ లో క్రైస్తవులపై, చర్చీలపై దాడులకు నిరసనగా గరిడేపల్లి మండల కేంద్రంలో గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుత ర్యాలీని నియోజకవర్గ, మండల పాస్టర్లు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ నాయకులు మాట్లాడుతూ.. మణిపూర్ లో అధికార పార్టీ మత ఘర్షణలకు ప్రేరేపిస్తుందన్న వదంతులను తిప్పి కొట్టేలా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార లెక్కల ప్రకారం 400 మంది పైగా మరణించారనే సమాచారం దేశవ్యాప్తంగా ప్రజలు మాట్లాడుకుంటున్నారని, ప్రభుత్వం ఏం చేస్తుంది.. ప్రజా సంఘాలు ఎక్కడికి వెళ్లాయి.. మీడియా ఉందా.. లేదా.. మానవ హక్కుల కమిషన్ ఎక్కడ బయటికి ప్రపంచానికి మారణకాండను దాచిపెట్టి ఎందుకు దాడిని ఖండించలేని పరిస్థితిలో ఉన్నాయా.. అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవులపై, చర్చీలపై దాడులను అరికట్టాలని, మణిపూర్ లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని అన్నారు. భారత రాజ్యాంగ విలువలను కాపాడి క్రైస్తవులకు మత స్వేచ్ఛ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దేవసహాయం, ఉదయ్ బాబు, రవికాంత్, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ యూత్ కన్వీనర్ పాస్టర్ జె జె సామ్యూల్ సన్, మండల పాస్టర్లు మంద బెంజమిన్, మత్తయి, ఫిలిప్, జాకబ్, దయాకర్, ఆమోస్, సుధాకర్ రావు. పీటర్, ధర్మయ్య, ప్రభు కిరణ్, కె.సుధాకర్, డా. యశ్రోన్, ఇ.ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**సిఐ మహేష్**

**చిట్యాల నార్కట్పల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**



చిట్యాల,విశాలభారతి:గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చిట్యాల నార్కట్పల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నార్కట్పల్లి సిఐ టి. మహేష్ కోరారు. వర్షాలు భారీగా కుడుస్తున్నాయని ముఖ్యంగా నార్కట్పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామం మూసి వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని మూసి పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చేపలు పట్టేవారు వాగులు చెరువులలోకి వెళ్ళవద్దని, రోడ్డు ప్రయాణాలు చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో పిల్లలని బయటికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు చూసుకోవాలని చెరువులు కుంటల వద్దకు పిల్లలు, యువత వెళ్లకుండా చూసుకోవాలని వర్షాభావ పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉండకూడదని అత్యవసరమైతే తప్ప బయటకి వెళ్ళకూడదని కోరారు. ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే డయల్ 100 కి గానీ స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని అన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు చిట్యాల మండల ప్రజలు ఎస్ఐ రవి కుమార్ 8712670187 నంబర్ కి, నార్కట్పల్లి మండలం ప్రజలు ఎస్ఐ సైదాబాబు 8712670186 నెంబర్ లకి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.



# గ్రామపంచాయతీ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలి

**డాక్టర్ అంజి యాదవ్**

**నడిగూడెం,విశాలభారతి:** రాష్ట్రవ్యాప్తంగా గత 23 రోజుల నుంచి సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పై రాష్ట్ర ప్రభుత్వం చవితి తల్లి ప్రేమ చూపిస్తుందని డాక్టర్ అంజి యాదవ్ అన్నారు. శుక్రవారం పదవరోజు మన ఊరుకు మన గడపకు మన అంజన్న అనే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నడిగూడెం బృందావనపురం గోపాలపురం గ్రామాలలో పర్యటించిన డాక్టర్ అంజి యాదవ్. మండల కేంద్రంలో 23 రోజుల నుండి సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల శిబిరాన్ని సందర్శించి సమ్మెకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 23 రోజుల నుండి గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి స్పష్టమైన హామీ ఇంతవరకు ఇయ్యలేకపోతుందని అన్నారు. కార్మికులు సమ్మె చేయడం వలన గ్రామాలలో చెత్త పేరుకుపోయి గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోగా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. గత వారం రోజుల నుండి ఎడుతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో పేరుకుపోయిన చెత్త వలన గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికులను సమస్యలను పరిష్కరించి గ్రామాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఒకరోజు భోజన ఏర్పాటు కొరకు ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు చిమట నాగరాజు,వెంకన్న,కమలాకర్,అనిల్,శ్రీకాంత్,నాగరాజు,వెంకటమ్మ, సక్కుబాయి,ఉపేంద్ర, గురవమ్మ,రాజశేఖర్ నాయుడు దేశినేని,తోట కమలాకర్,వెంకటేష్ బాబు,నవీన్,కతిమాల వెంకన్న, మాలోవత్ బాలు,బండి గోపి,జగ్య, బాణావత్ రాజా,సాయి,సంతోష్ ,గోపి,సునీత,రమణి,నవీన్,అభినవ్,పవన్,నందు,చంటి పాల్గొన్నారు.



# ఫసల్ భీమా యోజన పథకంతో రైతులకు మేలు

- **రైతులకు నష్టపరిహారం చెల్లించాలి**
- **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్**

**బాల్కొండ, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ఫసల్ భీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టివుంటే రైతులకు పంటనష్టం జరిగిన సమయంలో చాలా మేలు జరిగేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి అన్నారు.భారీ వర్షానికి దెబ్బతిన్న పంటపోలాలను నియోజకవర్గంలోని భీమ్‌గల్ పట్టణంలో ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ కప్పల వాగు కింద నాసిరకంగా నిర్మించిన రెండవ చెక్ డ్యామ్ తెగిపోయి సుమారు 100 ఎకరాల పంటపొలాలు వరదకు కొట్టుకపోయి నష్టంవాటిల్లిందన్నారు. అవసరం లేకున్నా ఇష్టారీతినా చెక్ డ్యాం నిర్మించడంతో వర్షాలకు చెక్ డ్యామ్ తెగిపోయి వరద నీరు పంటపోలాల నుంచి పోవడంతో పంటపొలాలు తీవ్రంగా నష్ట పోయాయన్నారు.దీంతో రైతులందరు తీవ్ర దుఃఖంలో ఉన్నారన్నారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడం మాత్రమే కాదని, రైతులను కూడా ఆదుకోవాలన్నారు.రైతులకు మేలు చేయలేని అసమర్థ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్,బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్,మండల అధ్యక్షుడు ములిగే మహిపాల్,పట్టణ అధ్యక్షుడు యోగేశ్వర్ నర్సయ్య,బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కనికరం మధు,సంధ్య రాజు, బాపురావ్,నవీన్, గంగాధర్,నర్సయ్య యాదవ్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# పేదల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేదు.!

- **వర్షా లొస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు.**
- **టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్.**
- **షాద్ నగర్ ఆర్డీవో కార్యాలయం ముందు కాంగ్రెస్ నిరసన.**



**షాద్ నగర్ విశాలభారతి:** పేదల ప్రాణాలంటే ప్రభుత్వానికి, అధికారంలోని నాయకులకు లెక్కలేకుండా పోయిందని,వర్షాలొస్తే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లిశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు.శుక్రవారం షాద్ నగర్ ఆర్డిఓ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గతవారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి పేదల ఇండ్లు కూలిపోతున్నాయని, ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులు గాని,ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించడం,లేదని పేదల గోడు వినిపించుకోవడంలేదని ఆయన విమర్శించారు.
వర్షాలు వస్తే పేదలు తమ ఇండ్లలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతకాల్సిన కర్మ ఏర్పడిందని అన్నారు. వర్షాలకు ఇల్లు కూలి, నిలువ నీడలేక ఆదుకునే వారు లేక ఎంతోమంది ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీర్లపల్లి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సకాలంలో కట్టించి ఇచ్చి ఉంటే వారికి ఈరోజు ఈ తిప్పలు ఉండేవి కావని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో నష్టపోయిన పంటల పరిశీలన చేపట్టి క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించి ప్రభుత్వానికి వెంటనే అందజేయాలని సూచించారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఇల్లు కూలిపోయిన పేదలను సకాలంలో ఆదుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబర్ ఖాన్, గుండ్రాతి బాలరాజ్ గౌడ్, చెన్నయ్య, చల్లా శ్రీకాంత్ రెడ్డి, కొమ్ము కృష్ణ, రఘు, జంగ నర్సింహా, సీతారాం, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వీరుల త్యాగానికి ప్రతీక మొహర్రం

**మున్సిపల్ చైర్మన్**

**చిట్యాల,విశాలభారతి:** వీరుల త్యాగానికి ప్రతీక మొహర్రం పండుగ అని మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం చిట్యాల మున్సిపాలిటీ పరిధి లోని శివనేని గూడెం గ్రామం నుండి పీరీలని ఊరేగింపుగా చైర్మన్ ఇంటికి తీసుకొని రాగ మున్సిపల్ చైర్మన్ దంపతులు బెల్లం, ఊదు సమర్పించి, దట్టిలు కట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ త్యాగాని కి ప్రతిక మెహరం అని మతాలకతీతం గా జరుపుకునే పవిత్ర పండుగ అని అన్నారు.

# అటకెక్కిన ఆటల ప్రాంగణం

- వెలిమినేడులో పూర్తికాని క్రీడా ప్రాంగణం
- వర్షా లు రావడం వల్ల పూర్తి కాలేధంటున్న అధికారులు
- రెండు రోజుల్లో పూర్తి చేస్తాం - ఎంపీఓ పద్మ



**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో ఆటల ప్రాంగణం అటకెక్కింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించిన కొన్ని గ్రామాలలో ఇంకా పనులు పూర్తి కాలేదు.
వెలిమినేడు గ్రామంలో ఆటల ప్రాంగణం కోసం స్థలాన్ని చదును చేసి క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డులను కూడా చేయించారు. కానీ ఏం లాభం నిరుపయోగంగా పడి ఉన్నాయి. గత సర్వసభ్య సమావేశాల్లో కూడా స్థానిక ఎంపీటీసీ దేశ బోయిన స్వరూప నరసింహ క్రీడా ప్రాంగణాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అప్పుడైతే హామీ ఇచ్చారు కానీ పూర్తి చేయడం మరిచారు. ఈ విషయమై అధికారులకు పలు మార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణం ఏర్పాట్లను పూర్తి చేయాలని కోరుతున్నారు.

**ఎంపీఓ వివరణ ఇస్తూ...**
వెలిమినేడు గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు ఆలస్యం అయిన మాట వాస్తవమేనని నేలని చదును చేసి బోర్డులను ఏర్పాటు చేద్దాం అనేసరికి వర్షాలు ప్రారంభం కావడంతో పని ఆగిపోయిందని రెండు మూడు రోజుల్లో పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

## మంత్రి వేములను కలిసిన డిప్యూటీ కలెక్టర్



**బాల్కొండ,విశాలభారతి:**
డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పొందిన వేల్పూర్ తహశీల్దార్ రాజేందర్, భీమ్‌గల్ తహశీల్దార్ శ్రీధర్,మోర్తాడ్ తహశీల్దార్ బాబయ్య లు శుక్రవారం వేల్పూర్ లోని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారికి మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.







## దెబ్బతిన్నా పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**బాల్కొండ,విశాలభారతి:** ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్నా పంటలను శుక్రవారం నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండల వ్యవసాయ అధికారి జి.సాయి కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమ్‌గల్ మండలం లోని వివిధ గ్రామాల్లో దెబ్బతిన్నా వరి,మొక్కజొన్న,సోయా పంటలను విస్తీర్ణ అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా 2,500 ఎకరాలలో వరి పంట,50 ఎకరాలలో మొక్కజొన్న,50 ఎకరాలలో సోయా పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు.ఈ నివేదికను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని అన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక అల
- రెండవ ప్రమాద హెచ్చరిక జారీ.
- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- భద్రాచలానికి వరద ఉధృతి
- కరకట్ట లీకేజీలు లేకుండా చూడాలి



**భద్రాచలం, విశాలభారతి:** భారీ వర్షాల మూలంగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. శుక్రవారం ఆమె మీడియతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతం నుండి వచ్చే వరదతో గోదావరి నీటిమట్టం గంట గంటకు వేగంగా పెరుగుతుందని లోతట్టు గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావడానికి సహకరించాలని తెలిపారు. గోదావరికి ఎగునున్న ప్రాజెక్టుల నుంచి ఉధృతంగా నీరు వస్తున్నందున ఈ రోజు సాయంత్రం వరకు భద్రాచలం వద్ద గోదావరి 60 అడుగులకు చేరే అవకాశం ఉన్నదని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముంపుకు గురయ్యే ప్రాంత ప్రజలు జాప్యం చేయక యంత్రాంగానికి సహకరించి పునరావాస కేంద్రాలకు రావాలని కలెక్టర్ సూచించారు. అలాగే వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దని చెప్పారు. అత్యవసరమైతే కంట్రోల్ రూములకు కాల్ చేయాలని చెప్పారు. ఏమైనా ప్రమాదాలు ఏర్పడినప్పుడు వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. జలాశయాల వద్దకు ప్రజలు రాకుండా పటిష్ట నియంత్రణ చేయాలని చెప్పారు. వరద నిలిచిన రహదారుల్లో రవాణా నియంత్రణకు ట్రాక్టర్లు అడ్డు పెట్టాలని అధికారులను ఆదేశించారు. పునరా వాస కేంద్రాల్లో ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం ప్రజలు వరద తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని గోదారి వద్దకు ఎవరు వెళ్ళవద్దని సూచించారు.



## వరద నీటి సమస్య పరిష్కారానికి కృషి

**కోదాడ,విశాలభారతి:** వార్డులో నెలకొన్న వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ కోట మధు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 22వ వార్డులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద నీరు ఆగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులు వెంటనే జెసిబి సహాయంతో గునాలు ఏర్పాటుచేసి వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా సమస్యను పరిష్కరించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య తలత్తిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు బొర్రా వంశీ నాని, దొంగరి సుధాకర్ , శ్రీనివాస్ రెడ్డి రాజు, నాగ బ్రహ్మచారి ,శేఖర్ , మీరా, వార్డు ఆఫీసర్ రాజయ్య, వార్డు జవాన్ కిషోర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఐఐటి విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే భగత్

**సహకారం అందిస్తానని హామీ**

**హాలియా విశాలభారతి:** నాగార్జునసాగర్ మండలం, తిరుమలగిరి నాయకుని తండా గ్రామానికి చెందిన మేరావత్ బాలచందర్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఐఐటి ప్రవేశ పరీక్ష లో ఐఐటి ఖరగ్పూర్ లో ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించాడు. ఐఐటి విద్యార్థి భానుచందర్ సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం హాలియా క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే భానుచందర్ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది అనడానికి భానుచందర్ ఐఐటీ ఖరగ్పూర్ లో సీటు సాధించడ మే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. భానుచందర్ విద్యకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమం లో కాలేజీ బృందం ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, ప్రసన్న, గిరి, సోమయ్య, ముజాహిద్, నాయకులు నల్లగొండ ఆంజనేయులు (డిఈఈ), మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లొండ సుధాకర్, హాతీరాం, రతన్ తదితరులు పాల్గొన్నారు.



## శరవేగంగా రామన్నపేటలో అభివృద్ధి పనులు

- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు
- వీధి వీధికి సిసి రోడ్లు నిర్మాణ పనులు

**యాదాద్రిరామన్నపేట,విశాల భారతి:** రామన్నపేట పట్టణ కేంద్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని 2వ వార్డ్ కళ్లెం ధర్మనీల ఇంటి వద్ద నుండి మహమ్మద్ మధార్ సాబ్ ఇంటి వరకు వేస్తున్న సిసి రోడ్డు పనులను నాయకులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వీధిలో సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు, సీసీ రోడ్ల నిర్మాణం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జాడ సంతోష్,మిర్జా అస్లం బెగ్, 2వ వార్డ్ మెంబర్ సయ్యద్ జహేర గఫూరు, సయ్యద్ ఖదీర్,అబ్దుల్,ఇంతియాజ్, బాఖర్ తదితరులు పాల్గొన్నారు.



## పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న వావ్ సంస్థ సభ్యులు చంద్రుగొండ అరుణ

**భద్రాచలం,విశాలభారతి:** భద్రాచలం ప్రాంతంలో ని సుభాష్ నగర్ కాలనీ ప్రజలను పునరావస కేంద్రాలకు తరలిస్తున్న వావ్ సంస్థ సభ్యులు చంద్రుగొండ అరుణ భీమ్వాక. రామలక్ష్మి. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ ఐ టి సి అనుబంధ వావ్ సంస్థ అధికారుల ఉత్తర్వుల మేరకు సుభాష్ నగర్ కాలనీ వరద ఉధృతి ఎక్కువ అవుతున్నందున ఆ ప్రజలను ఖాళీ చేపిస్తూ ఉన్నామని ముందస్తు చర్యగా ఇక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని వారు తెలిపారు ఈ కాలనీ లోతట్టు ప్రాంతం అవటం వలన ఇళ్లల్లోకి వరద నీరు చేరడానికి అవకాశం ఉన్నందున రెండవ ప్రమాద హెచ్చరిక అమల్లో ఉన్నది కనుక ఇక్కడ ప్రజలను సురక్షితంగా ట్రాక్టర్లో పంపించడం జరుగుతుందని వారు అన్నారు. ప్రజలు సహకరించాలని పునవస కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు అధికారులు కల్పించారని వారు తెలిపారు. వావ్ సంస్థ సభ్యులు ప్రతి కాలనీలో పని చేస్తున్నారని వారు అన్నారు.

## ముదిరాజుల కడుపు కొట్టిన వానలు



**పాలేరు,విశాలభారతి:** గత వారం రోజులు దంచి కొట్టిన వానాలతో చెరువులు నీట మునిగి అలుగులు పోయడంతో చెరువు పై ఆధారపడ్డ ముదిరాజులు ఆర్థికంగా నష్టపోయామని జల్లేపల్లి గ్రామ సొసైటీ, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భాషబోయిన వీరన్న,శైలజ అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లెపల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ పరిధిలో గల తుమ్మల చెరువు, గిరికుంట' లకు వలలు ఏర్పాటు చేశారు. అయితే ఎడతెరిపి లేని వర్షాలతో నిండిన చెరువులు అలుగులు పోసాయి. వరద తాకిడిని తట్టుకోలేక వలలు తెగి కొట్టుకుపోయాయి. దీంతో సుమారు 12టన్నుల చాపలు వరదలతో కొట్టుకుపోయాయని ముదిరాజులు కన్నీటి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన కాకరవాయి గ్రామం మద్దుల చెరువులోను జరిగింది. సుమారు 13టన్నుల చేపలు అలుగులో పోయినట్టు తెలిపారు. చెరువులపై ఆధారపడి బ్రతుకుతున్న మాకు భారీ నష్టాన్ని మిగిలిచ్చిందని ప్రభుత్వం బాధిత గ్రామాలను గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

## కలెక్టర్ ని కలిసిన ఎమ్మెల్యే భగత్



**నల్లగొండ,విశాలభారతి:** నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ఆర్.వి కర్ణర్ ని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ మర్యాదపూర్వకం గా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు.

# నీట మునిగిన పత్తి చేనులు

**ఆందోళనలో పత్తి రైతులు**

**యాదాద్రి రామన్నపేట,విశాలభారతి:** గత పది రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు, భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో పత్తి చేనులు నీట మునిగాయి. ఈ ఏడాది రైతులు అధిక మొత్తంలో పత్తి సాగు చేశారు. రోహిణి, మృగశిర కార్తెలో పత్తి గింజలు విత్తగా, సరైన వానలు కురవకపోవడంతో పత్తి మొలకలు మొలవక రైతన్నలు రెండోసారి పత్తి గింజలు విత్తారు .అడపదడప కురుస్తున్న వర్షాలతో కాలం అవుతుందో లేదో అని అయోమయంలో పడ్డ రైతన్నలు చిన్నపుశాల కార్తెలో కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలం అయ్యారు. జనంపల్లి ,ఇస్కిల్లా ,కక్కిరేణి ,ఎన్నారం గ్రామాల్లో రేగడి నేలలు జాలువారి నీరు చిచ్చు వచ్చి అధిక మొత్తంలో పత్తి మొక్కలు వాడిపోయి చనిపోగా ,కొన్నిచోట్ల పత్తి చేనులు పూర్తిగా నీట మునిగాయి. దుక్కులు దున్ని, విత్తనాలు పెట్టి, ఎరువులు పోసి ,కలుపు తీసి ఎకరాకు రూ.15000 పెట్టుబడి పెట్టిన రైతన్నలు కాస్త భారీ వర్షాలతో ఆందోళనలో పడ్డారు .కలుపుతీత సమయంలో కూలీలు దొరకక ,వరి నాట్లకు వెళ్లడంతో కొంతమంది రైతులు పత్తి చేనులలో కలుపు తీయకపోవడంతో, కలుపు విపరీతంగా పెరిగి ఆర్థిక భారం కానుంది. ఎడతెరిపి లేని వర్షాలకు నీట పత్తి రైతులకు పంట నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



## జివిల్ ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్సై

**బాల్కొండ,విశాలభారతి:** మెండోరా మండలం సావెల్, కోడిచెర్ల,మెండోరా గ్రామాలకి చెందిన ముగ్గురు వ్యక్తులు నిర్లక్ష్యంగా కేజీవిల్ ట్రాక్టర్లను ఎటువంటి పట్టీలు లేకుండా బీటీ రోడ్డుపై నడపడంతో వాటిని శుక్రవారం ఆర్మూర్ ఏసిపి జగదీష్ చందర్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు మెండోరా ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కేజీవిల్ ట్రాక్టర్లు రోడ్డుపై నడపడం వల్ల రోడ్డు కొన్ని రోజులకే పాడవుతుందని అన్నారు. ఎవరైనా రోడ్డుపై ఇలాంటి వాహనాలను నడిపించినట్లు అయితే తమకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్సై శ్రీనివాస్ అన్నారు.

# అకాల వర్షానికి కూలిన ఇల్లు

**పరిశీలించిన రెవెన్యూ అధికారులు**



**కోదాడ,విశాలభారతి:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి పట్టణంలోని 34 వ వార్డులో నివాసం ఉంటున్న సోమపంగు సామ్రాజ్యం ఇంటి పై కప్పు అర్ధరాత్రి కూలింది. శిథిలావస్థలో ఉండి పాత ఇల్లు కావడంతో వర్షానికి నాని ప్రమాదకరంగా ఉండటం ఆ గదిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ 34వ వార్డు ఇన్చార్జ్ గంధం పాండు రెవెన్యూ అధికారులకు వెంటనే సమాచారం అందించారు. బాధిత ఇల్లును ఆర్ ఐ నగేష్ పరిశీలించి పంచనమ చేశారు. నివేదికను ప్రభుత్వానికి పంపించి వీలైనంత తొందరలో పరిహారం అందే విధంగా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చీమ శ్రీను, మాజీ వార్డ్ మెంబర్ కుదుముల చిన్న వెంకయ్య,మాజీ ఎంపీటీసీ కాసర్ల సత్యవతి, కలకొండ గోపయ్య, కర్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేటదంతాలపల్లి ప్రధాన రహదారిపై ఉన్న గుండ్ల సింగారం బ్రిడ్జిని పునర్ నిర్మించాలి

- **జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్**
- **ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రీతం**

**తుంగతుర్తి,విశాలభారతి:** మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామంలో నీట మునిగిన ఇండ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా నూతనకల్ మండల ఎడవల్లి రోడ్డు వర్షాలకు దెబ్బ తినడంతో వాటిని పరిశీలించారు. దంతాలపల్లిసూర్యాపేట ప్రధాన రహదారిపై ఉన్న గుండ్ల సింగారం బ్రిడ్జి దగ్గర రోడ్డు కొట్టుకపోయింది. రోడ్డును పరిశీలించిన నాయకులు మాట్లాడుతూ 60 ఏళ్ల క్రితం కట్టిన గుండ్ల సింగారం బ్రిడ్జిని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.అలాగే వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 25 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరిగారి ప్రీతం, పీసీసీ అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞాన్ సుందర్, సూర్యాపేట జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, నూతనకల్ సర్పంచ్ కరుణ, మద్దిరాల, నూతనకల్ అధ్యక్షులు ముక్కల ఆవిలమల్లు, నాగం సుధాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ కొండరాజు, యువజన నాయకులు, పసుల అశోక్, పెద్దబోయిన అజయ్, వివిధ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సైగా ఎం. మహేందర్

**జఫర్ గడ్, విశాలభారతి:** జనగామ జిల్లా జఫర్ గడ్ నూతన ఎస్ఐ గా ఎం. మహేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఐ బి. శంకర్ నాయక్ ప్రమోషన్ పై సీఐగా బదిలీ కాగా జఫర్ గడ్ ఎస్ఐగా ఎం .మహేందర్ బాధ్యతలు చేపట్టినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన విషయాలైనా తన దృష్టికి తీసుకు వస్తే తగు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. నూతన ఎస్ఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.





## భీమ మురళి కుటుంబాన్ని పరామర్శించిన ఆర్మూర్ ఎమ్మెల్యే

**ఆర్మూర్,విశాలభారతి:** ఈనాడు విలేఖరి భీమ మురళి తండ్రి ఇటీవలే మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పియుసి చైర్మన్ బారాస నిజామాబాద్ పార్టీ అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో మక్లూర్ ఎంపీపీ మాస్తా ప్రభాకర్ నందిపేట్ బారాస సీనియర్ నాయకులు ముత్యం తదితరులు పాల్గొన్నారు



## మానవత్వం చాటుకున్న పాలకుర్తి పోలీసులు

- **వర్షా నికి ఇల్లు కూలిన నిరాశ్రయులకు అండగా**
- **సీఐ విశ్వేశ్వర్**

**పాలకుర్తి,విశాలభారతి:** ఖాకీలంటే కఠినమైన మనసే కాదు,మంచి మనస్సుని కూడా కలిగిన వారమని నిరూపించిన పాలకుర్తి పోలీసులు తెలంగాణరాష్ట్ర వ్యాప్తంగా కొద్ది రోజులుగా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు కుంటలు, వాగులు,వంకలు నిండి రహదారులపై పొంగి పొర్లతున్నాయి. దీంతో కొన్ని గ్రామాలకు రవాణా అంతరాయం కలిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అందులో భాగంగానే కొడకండ్ల మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన, కోక సోమయ్య ఇల్లు వర్షానికి కూలిపోయి కుటుంబం రోడ్డున పడగా పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్ వారి దీనస్థితిని చూసి మనసు చలించి 5 వేల రూపాయలు 25 కిలోల బియ్యం, వంట సామాగ్రి ని అందజేశారు. సిఐ తో పాటు పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల ఎస్సైలు శ్రీకాంత్, రమేశ్ నాయక్, శ్రావణ్ లు కూడా సహాయాన్ని అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సోమయ్య కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.





# వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- **ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది**

**అశ్వాపురం,విశాల భారతి:** అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామంలోని జెడ్పీ ఎస్ ఎస్ పాఠశాలలో నందు గోదావరి నది ముంపు ప్రాంత ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సందర్శించారు.ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని వారికి భరోసా కల్పించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు.ఎటువంటి సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. గోదావరి నది బాధితులకు పొందుతున్న సౌకర్యాల గురించి ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారు, విస్తృతంగా పర్యటిస్తూ బాధిత కుటుంబాలకు భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తున్నారు, అనంతరం చింతిర్యాల గ్రామంలో గోదావరి నది ఉధృతి ప్రవాహాన్ని పరిశీలించారు.ఈసందర్భంగా రెవిన్యూ పోలీస్, ఎలక్ట్రికల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి హెల్త్ పలు ప్రభుత్వ శాఖల అధికారులను క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు, అధికారులు ముంపు ప్రాంతాల్లోనే ఉండి పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**మిషన్ భగీరథ గొప్ప కార్యక్రమం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామంలోని రథం గుట్ట ఉన్న గల మిషన్ భగీరథ 40ఏమ్ ఎల్ డి నీటి శుద్ధి కేంద్రము ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సందర్శించారు. తొలిత వాటర్ ఫిల్టర్ బెడ్, మిషన్ భగీరథ పంప్ హౌస్ లను, సంప్ వద్ద మిషన్ భగీరథ ద్వారా వస్తున్న మంచినీటిని పరిశీలించారు. వాటర్ ట్యాంకులు నిర్వహణ తదితర అంశాలను మిషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు , ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ స్వరాష్ట్రంలో తాగునీటి సమస్యతో దశాబ్దాల పాటు ఇబ్బందులు పడ్డ ప్రజలకు స్వరాష్ట్రంలో మిషన్ భగీరథ తో సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపించారు అన్నారు, పల్లెలు పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తున్నామన్నారు.తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామరక్షని తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందాలనే సంకల్పంతో మిషన్ పథకాన్ని ఏర్పాటు చేసి విజయవంతంగా అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుంద అన్నారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందాలని సమున్నత లక్ష్యంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటింటికి రక్షిత మంచినీరు అందిస్తున్నారని అన్నారు.



## ముంపు ప్రాంతాలలో ప్రజా ప్రతినిధులు, అధికారుల చర్యలు శూన్యం

- **మున్సిపల్ కార్యాలయంలో ధర్నా వినూత్న నిరసనగా వంట వార్పు కార్యక్రమం...**

**మేడిపల్లి విశాల భారతి:** పిర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో ముంపు ప్రాంతాలలో ప్రజా ప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని స్థానిక కార్పొరేటర్ మరియు మేయర్ కాలనీ సమస్యలను పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఆందోళన భాగంగా శ్రీ సాయి నగర్ కాలనీ ఈస్ట్, సౌత్ కమలానగర్ ఈ రెండు కాలనీ ఆధ్వర్యం లో సుమారు 150 మంది కాలనీ వాసులతో కలిసి ర్యాలీగా బయలుదేరి జిహెచ్ఎంసి మున్సిపల్ కార్యాలయంలో ఆందోళనతో పాటు ధర్నా చేపట్టారు. వీటితో పాటు మున్సిపల్ కార్యాలయంలో టెంట్ వేసి వంటావార్పు కార్యక్రమం చేపట్టి కాలనీవాసులు అందరు కలిసి భోజనాలు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరద ముంపు ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదిక న చర్యలు తీసుకోవాలని ఎస్ ఎన్ డి పి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు కమిషనర్ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ వంశీ కృష్ణ మున్సిపల్ సిబ్బందితో కలిసి శ్రీ సాయి నగర్ కాలనీ ఈస్ట్, సౌత్ కమలానగర్ కాలనీలలో పర్యటించారు.





## డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో గందరగోళం

- **అధికారపార్టీ నేతల అనుచరులకు గుట్టు చప్పడు కాకుండా పంపిణీ.**
- **బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు రవీందర్ నాయక్.**

**మేడిపల్లి,విశాలభారతి:** మేడిపల్లి మండలంలో ని పీర్జాదిగుడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్వతపూర్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లను స్థానిక ప్రజలకు అసలైన లబ్ధిదారులకు కేటాయించ కుండా అధికారపార్టీ నేతల అనుచరులకు గుట్టు చప్పు డు కాకుండా కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూమని బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం డబుల్ బెడ్ రూమ్ లలో నివాసముంటున్న అసలైన లబ్ధిదారులను కలిసి వారికి బీఎస్పీ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంద ని తెలిపారు. స్థానిక మహిళలతో మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి నిజమైన లబ్ధిదా రులకు పట్టాలు వచ్చే విధంగా బీఎస్పీ పార్టీ కృషి చేస్తుందని వారికి తెలిపారు. ఎవరికి తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా స్థానిక ఎమ్మార్వో ఏకపక్షంగా స్థానికే తరులకు ఇళ్లు ఉన్న వారికే అలాట్ మెంట్ లెటర్ లు ఇవ్వడమెంటని బీఎస్పీ నేతలు ప్రశ్నించారు. అధికార పార్టీ కార్పొరేటర్ల అనుచరులకు ఈ డబుల్ బెడ్ రూమ్ లను కేటాయిం చారని స్థానిక ప్రజలు చెపుతున్నారన్నారు. తహసిల్దార్ అలట్ చేసినా లబ్ధిదారులు వేరే రాష్ట్రానికి చెందిన వారని వారంతా కార్పొరేటర్ల అనుచరులేనని స్థానిక మహిళలు ఆరోపిస్తు న్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఆర్డీవో స్పందించి స్థానిక ప్రజలకు ఇళ్లులేని పేద ప్రజలకు ఈ డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించాలని బీఎస్పీ పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు. కలెక్టర్ స్పందించి ఈ విషయంలో అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ లను జిల్లా అధ్యక్షుల రవీందర్ నాయక్ తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల అంబేద్కర్, కోశాధికారి కసుకుర్తి శ్రీహరి, స్థానిక ప్రజా సంఘాల నాయకులు రాము, అమర్, కార్తీక్ లు పాల్గొన్నారు.

## మైనార్టీలను రుణాల పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వం

**మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా**



**భద్రాద్రి కొత్తగూడెం,విశాల భారతి:** మైనారిటీలకు వంద శాతం సబ్సిడీతో రుణాలందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం అమాయక మైనార్టీలను మోసం చేస్తున్నదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండి. యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత తొమ్మిదేళ్ళలో కంటి తుడుపు చర్యగా ఒక్కసారి మాత్రమే రుణాలనందించి చేతులు తుడుపుకున్నారని విమర్శించారు. గత ఏడాది డిసెంబర్ లో మైనారిటి ఋణాలకు ధరఖాస్తు స్వీకరించి ఏడు నెలలు కావస్తున్నా, నేటి వరకు రుణాలు విడుదలకు నోచుకోలేదన్నారు. గత కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి మైనారిటీలకు వంద శాతం సబ్సిడితో రుణాలందిస్తామని ప్రకటించగా, మైనారిటీ శాఖ విడుదల చెసిన ఉత్తర్వులు, మరియు గైడెలైన్లలో నూతన దరఖాస్తులు చేసుకోవాలని ప్రస్తావించకపోవడంతోపాటు 2223లలో ధరఖాస్తు చేసుకున్న వారికే నిబందనల మేరకు రుణాలందిస్తామని, అదేవిధంగా ప్రతి నియోజకవర్గానికి కేవలం 120 మందికి మాత్రమే రుణాలాందిస్తామని పేర్కొనడం జరిగిందని, ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రకటనకు, మైనారిటీ శాఖ విడుదల చేసిన ఉత్తర్వులకు పోంతన లేదని మండిపడ్డారు. ప్రభుత్వం నిరుపేద మైనారిటీలతో చెలగాటమాడుతుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన మేరకు అర్హులైన లబ్దిదారులందరికి ఆన్లైన్ లో ధరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించి అర్హులైన వారందరికీ రుణాలు అందించాలని, లేని యెడల రానున్న ఎన్నికల్లో మైనారిటిలు తగిన గుణపాఠం చెప్తారని హితవు పలికారు.



## కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి

**హైదరాబాద్,విశాలభారతి:** ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గత 19 సంవత్సరాలుగా కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న 1804 మందిని క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ కి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాలోత్ భిక్షపతి నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఉపాధ్యాయుల సంబంధించిన నోట్ ఫైల్ ను గిరిజన సంక్షేమ శాఖ సంబంధిత అధికారులు నుండి తెప్పించుకొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మాలోత్ సోమేశ్వర్, రాష్ట్ర కోఆర్డినేటర్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దారావత్ బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సమ్మయ్య రాథోడ్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు భూక్య తిరుపతి, రాష్ట్ర కోశాధికారి బాదావత్ శ్రీను, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, సరేష్, హరీరాం, భరత్, హాథీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## డీసీఎం నుండి కొట్టిన లారీ డ్రైవర్ మృతి

**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం జాతీయ రహదారి 65 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందడం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండల శివారులోని ఏషియన్ పెయింట్స్ డబ్బాలని డ్రైవర్ రామ్ లఖన్ వర్మ GJ 18 AZ 3086 నంబర్ గల లారీలో లోడ్ చేసుకొని సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్న పృథ్వీరాజ్ జాదవ్ తో కలిసి విశాఖపట్నం కు బయలుదేరగా శుక్రవారం ఉదయం 2.30 నిల ప్రాంతంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారికి రాగానే డ్రైవర్ తన లారీని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ టైరు పంచర్ అయి పార్క్ చేసి ఉన్న TS 07 UK 1215 నెంబర్ గల డీసీఎం ని వెనుక భాగంలో ఈ కొట్టి పక్కన ఉన్న గుంతలో పడిపోవడం తో డ్రైవర్ రాం లకన్ వర్మ అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. సత్య కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై జాన్ రెడ్డి తెలిపారు.





# త్యాగనిరతికి ప్రతిక ముహర్రం

- బీఆర్ఎస్ నేత నీలం మధు ముదిరాజ్
- నందిగామలో పీర్లను దర్శించుకున్న యువ నేత

**పటాన్ చెరు, విశాల భారతి:** త్యాగనిరతికి, సహనానికి ప్రతీక ముహర్రం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ముహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలో నీలం మధు పీర్లను దర్శించుకుని, చాదర్ సమర్పించారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు నీలం మధు ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాల కతీతంగా హిందూ, ముస్లింల ఐక్యతను, గంగా జమున తహజీబ్ ను ఈ ముహర్రం చాటిచెప్తుందని పేర్కొన్నారు. అన్ని మతాల పండుగలను కలిసకట్టుగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, పాష, జహంగీర్, మహబూబ్, బాబు, బంటు రాములు, జంగయ్య, బాలయ్య, నరేందర్, ఈశ్వర్, శంకర్, రాజేందర్, అనిల్, రాఘవ, రాజు, మహేష్, ముస్లిం సోదరులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







# ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ప్రముఖుల పరామర్శ

**పటాన్ చెరు, విశాలభారతి:** పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని పలువురు ప్రముఖులు శుక్రవారం పరామర్శించారు. కొడుకుని కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని ప్రముఖులు వివిధ పార్టీల నేతలు స్థానికులు కలిసి పరామర్శిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ భాను ప్రసాద్ రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, రాప్తాడు శాసనసభ్యులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పటాన్ చెరు మాజీ శాసనసభ్యులు నందీశ్వర్ గౌడ్, పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, హెచ్ఎంటీవీ సీఈఓ లక్ష్మి తదితరులు పరామర్శించారు. ప్రజా నాయకుడిగా ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలుస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికు పుత్రశోకం పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.







**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని పరామర్శించిన నీలం మధు**

పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన నివాసానికి వెళ్లి నీలం మధు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మూడు రోజుల క్రితం నీలం మధు ముదిరాజ్ సొంత మామ చనిపోయారు. గురువారం వరకూ సుష్టి ఉండడంతో అంత్యక్రియలకు రాలేకపోయానని నీలం మధు తెలిపారు. ఈ విషయమై ఘటన కుటుంబానికి తీరనిలోటని అని, ఈ సమయంలోనే అందరూ ఆయనకు ధైర్యాన్ని చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేవుడు ఆ కుటుంబానికి మనోధార్యాన్ని కల్పించాలని నీలం మధు ముదిరాజ్ కోరారు.



# చిన్నారులతో మొక్కలు నాటించాలి

రంగు ముత్యంరాజు గురుస్వామి



**సూర్యాపేట,విశాలభారతి:** జీవకోటికి ప్రాణవాయువును అందించే మొక్కలను పెంచాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా అధ్యక్షులు రంగు ముత్యంరాజు గురుస్వామి అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో బేబీ నిహస్వితో పాటు చిన్నారులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.మొక్కలు బావితరానికి మహావృక్షాలుగా మారి జీవకోటికి ప్రాణవాయువును అందిస్తాయన్నారు.ప్రతి ఒక్కరు తమ పిల్లలతో మొక్కలు నాటించాలని అలా మొక్కలు నాటిన చిన్నారులకు ఆ మణికంఠ స్వామి ఆశీసులతో పాటు భగవంతుని దీవెనలు ఎల్లవేళలా ఉంటాయన్నారు.



# ప్రజలచెంతకే పయనం

- వరదల వలన మండలంలో భారీ నష్టం
- బట్టా విజయ్ గాంధీ

**గుండాల, విశాల భారతి:** గుండాల మండలంలోని వరద ప్రభావిత ముంపు ప్రాంతాలలో పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సభ్యులు మాజీ జెడ్పిటిసి సభ్యులు బట్టా విజయ్ గాంధీ శుక్ర వారం విస్తృతంగా పర్యటించారు. ఆకాలవర్షాలు వరదల వలన ప్రజల పడుతున్న పలురకాల ఇబ్బందులను అడిగి తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసారు. అకాలవర్షాలు వరదలవలన నష్టపోయిన పలు రకాల వ్యవసాయ పంటపొలాలను పరిశీలిస్తూ పలువురు బసచేస్తున్న పునరావాస కేంద్రాలను సైతం పరిశీలించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
అధిక వర్షాల వలన గుండాల మండలంలో వరదలు వచ్చి చాలామంది నష్టపోయారన్నారు.
మండలంలోని బ్రిడ్జిలు,రోడ్లు,చెరువులు తెగిపోయాయని, పూరి గుడిసెలు పూర్తిగా పడిపోయాయని రైతుల వరి,మిర్చి నార్లు,పంట పొలాలు కొట్టుకుపోయాయని తెలియజేశారు.
సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేయించాలని సూచించారు.
అలాగే వరదల వలన ఇల్లులు కూలిపోయిన వారికి కొత్త ఇల్లులు మంజూరు చేయాలని,వరి మిర్చి నార్లు పొలాలు కొట్టుకుపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
అదేవిధంగా ఎవరు అధైర్య పడవద్దని కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ,ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలోగుండాల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కొడెం ముత్యమాచారి ఎంపీటీసీ కల్తీ కృష్ణ రావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొంబొయిన ముత్తయ్య ఈసం పాపరావు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పోంబోయిన శ్వేతగారు సోషల్ మీడియాసభ్యులు జబ్బ పొట్టయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

అమీన్ పూర్ మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి:** గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఏయ్ ప్రవీణ్, సీనియర్ నాయకులు గోపాల్ లతో కలిసి పలు వార్డులలో ఆయన పర్యటించారు. సెల్లార్లలో నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా కాలనీల సంక్షేమ సంఘం సభ్యులకు సూచించడం జరిగింది అని తెలిపారు. మున్సిపల్ తరపున అత్యవసర సహాయక బృందాలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వర్షపు నీటి కాలువలు చెత్తతో నిండిపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విపత్కర పరిస్థితిలో స్థానిక పోలీసులకు లేదా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని ఛైర్మన్ పాండురంగారెడ్డి కోరారు.



# బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం

**కాప్రా విశాలభారతి:** డివిజన్ గొల్ల బస్తీ కి చెందిన ముంతాజ్ బేగం (60) క్యాన్సర్ తో బాధపడుతూ మృతి చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండారి లక్ష్మారెడ్డి గారు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకి ఎలాంటి ఆపద వచ్చినా అండగా వుంటున్నాడు అని అన్నారు.ఈ కార్యక్రమంలో గూడ ఇంద్రయ్య, మచ్చా శ్రీకాంత్ గౌడ్, డప్పు బాబు, G. కృష్ణ, అజ్జు, ఆబ్బు, తహెర్, నబ్బు పాల్గొన్నారు.





# వరదలు తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తంగా ఉండాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

**బూర్గంపాడు,విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లోని గోదావరి ముంపు ప్రాంతాలలోని పలు గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు విస్తృతంగా పర్యటించారు, అదేవిధంగా కస్తూరి గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మరియు సారపాక గ్రామపంచాయతీలోని బిపిఎల్ స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను సందర్శించారు , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ ప్రజలకు అండగా నిలబడుతున్నామన్నారు. మెడికల్ క్యాంపులు వసతులు పరిశీలించారు. ప్రాంతాలలోని వరద బాధితులకు అండగా నిలుస్తూ వారికి ధైర్యం కల్పించారు, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు బాధితులకు భోజనం వసతులతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు, అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేపడుతున్నామని అన్నారు. వరద బాధితులకు పార్టీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటున్నామని అన్నారు ,ఈ పకృతి విలయానికి తల్లాడిన ప్రాంతాలలో ముమ్మరంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రేస్క్యూ టీంలు గజ ఈతగాళ్ళు పడవలను అందుబాటులో ఉంచామని సహకారాలలో అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అలాగే ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు.



# వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ వినతిపత్రం

**గరిడేపల్లి,విశాలభారతి:** రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొన్న సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ అపాయింట్మెంట్ ఇప్పించాలని చెన్నూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ విజ్ఞప్తి చేశారు హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ను కలిసి విజ్ఞప్తి చేసి వచ్చిన అనంతరం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వికలాంగుల సంఘాల నాయకులకు అపాయింట్మెంట్ ఇచ్చేందుకు ఎందుకు వెనకాడుతున్నారో అర్థం కావడం లేదని వికలాంగుల పెన్షన్ 4016లకు పెంచుతున్నామని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి వికలాంగుల సమస్యలపై వికలాంగుల సంఘాల నేతలతో చర్చించేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో తెలియ చేయాలని వికలాంగుల సమాజాన్ని కేవలం పెన్షన్ కే పరిమితం చేసి ముచ్చటగా మూడోసారి వికలాంగుల ఓట్లు దండుకోవాలని పగటి కలలు కంటున్నాడని ముఖ్యమంత్రి కెసిఆర్ కలలు కలలుగా మిగిలిపోతాయని పెన్షన్ పెంపుతోనే వికలాంగుల బతుకులు మారవన్న విషయాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇకనైనా గమనించాలని రాజ్యాధికారంలో వికలాంగులకు భాగస్వామ్యం దక్కించి వికలాంగుల బతుకులు మార్చేందుకు ముందుకు రావాలని లేకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రతిపక్ష స్థానం కూడా దక్కకుండా చేస్తామన్న రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ముఖ్యమంత్రి కేసీఆర్ కు వికలాంగులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యంగా గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యులుగా వికలాంగులు నామినేట్ చేయాలని 75 ఏండ్ల నుంచి రాజ్యాధికారానికి దూరమైన వికలాంగుల సామాజిక వర్గానికి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తారో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలో ఉన్న నాయకులు స్పష్టం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు కుర్ర గోపి యాదవ్ సంఘం జిల్లా నాయకులు మున్న మధు యాదవ్ సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుర్రం నరేష్ రెడ్డి మహిళా నాయకులు నాగమణి రమాదేవి పుల్లయ్య నర్రా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు



# 'ఖుషి' టైటిల్ సాంగ్ రిలీజ్

డాషింగ్ హీరో ది విజయ్ దేవరకొండ, సమంత కలిసి నటిస్తున్న పాన్ ఇండియన్ చిత్రం ఖుషి. శివ నిర్వాణ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. మైత్రీ మూవీస్ నిర్మిస్తోన్న ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదల కాబోతోంది. ఈ మధ్యే ఈ మూవీ షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను ప్రారంభించింది చిత్రయూనిట్. ఇప్పుడు మేకర్లు మ్యూజికల్ ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో చేపడుతున్నారు. తాజాగా ఖుషి థర్డ్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. ఖుషి అంటూ సాగే ఈ టైటిల్ సాంగ్ ఇప్పుడు శ్రోతలను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు శివ నిర్వాణ సాహిత్యం అందించారు. హిషామ్ అబ్దుల్ వాహబ్ స్వయంగా ఆలపించారు. ఇక హిషామ్ అబ్దుల్ వాహబ్ అందించిన బాణీ ఎంతో వినసొంపుగా ఉంది. ఇక ఇందులో విజువల్స్ మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఉన్నాయి. ఈ మెలోడీ సాంగ్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా మారనుంది. ఇప్పటికే ఖుషి ఫస్ట్ సింగిల్ నా రోజా నువ్వే వంద మిలియన్ల వ్యూస్‌ను క్రాస్ చేసింది. ఇన్‌స్టాగ్రాం రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో ఇలా ఎక్కడపడితే అక్కడ ట్రెండ్ అవుతూనే ఉంది. రెండో పాట ఆరాధ్య సైతం శ్రోతలను కట్టి పడేసింది. ఇప్పుడు ఈ మూడో పాట ఖుషి సైతం చార్ట్ బస్టర్ అయ్యేలా కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 1న తెలుగుతో పాటు తమిళ్, మళయాల, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయబోతోన్నారు.



# కేన్స్‌లో ప్రదర్శన కోసం 47 డ్రెస్సుల్లో ఐష్

మాజీ విశ్వసుందరి ఐశ్వర్యారాయ్ కి కేన్స్ ఫిలిం ఫెస్టివల్ తో ఉన్న అనుబంధం ఎలాంటిదో తెలిసిందే. 2002 నుండి ఐష్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరవుతోంది. అప్పటి నుండి దాదాపు అన్ని ఫెస్టివల్ ఎడిషన్‌లకు హాజరైంది. 2002లో కేన్స్‌లో మొదటిసారి కనిపించిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రజల హృదయాలను గెలుచుకుంది. ఐశ్వర్యరాయ్ 2003లో కూడా ఈ ఉత్సవానికి హాజరైంది. కానీ రెండోరి ప్రదర్శన తన రూపంపై తీవ్రంగా విమర్శలు వచ్చాయి. అయితే దీనిపై డిజైనర్ నీతా లుల్లా ఇప్పుడు ఓపెనయ్యారు. ఇటీవలి ఇంటర్వ్యూలో డిజైనర్ నీతా లుల్లా ఆ సంవత్సరం కేన్స్ ఈవెంట్లో ఐష్ ప్రదర్శనలో తప్పిదం గురించి వెల్లడించారు. వివిధ సందర్భాలలో ఐశ్వర్యతో 47 దుస్తులను పంపానని నీతాజీ వెల్లడించారు. కానీ రెండోసారి కేన్స్ ప్రదర్శనలో అక్కడ ఏదో తప్పు జరిగిందని తనపై విమర్శలు వచ్చాయని అన్నారు. నిజానికి తన పాదం ఫ్రాక్చర్ అయిందని ఆ సమయంలో ఆరోగ్యం బాలేదని నీతాజీ గుర్తుచేసుకుంది. అయితే ఐష్ ధరించిన నియాన్ గ్రీన్ చీరలో ప్రదర్శనపై విమర్శలొచ్చాయి. తన ఫ్యాషన్ సెన్స్ ని తీవ్రంగా విమర్శించారు ఫ్యాషన్ పోలీసులు. అయితే మొత్తం పండుగకు ఐష్‌తో పాటు 47 దుస్తులు ఉన్నాయి. రోజంతా ఉపయోగించే దుస్తులు అందుబాటులో ఉన్నాయి.. ఉదయం దుస్తులు.. మధ్యాహ్నం దుస్తులు, సాయంత్రం దుస్తులు, రెడ్ కార్పెట్ దుస్తులు ఇలా వేటికవే ప్రత్యేకంగా డిజైన్ చేసాం. కానీ ఎక్కడో నేను ఊహించినది తేడా కొట్టింది. బహుశా టైమింగ్ సరిగా లేదు. ఒక్కోసారి దుస్తులకు తగ్గట్టు నగలు మార్చవలసి ఉంటుంది. అక్కడ ఏం జరిగిందో నాకు నిజంగా తెలియదు అని నీతాజీ చెప్పారు ఆ సమయంలో తాను చాలా బాధపడ్డానని అయితే ఐశ్వర్య తనకు అండగా నిలిచిందని నీతా చెప్పింది. ''చాలా మంది తోటి డిజైనర్లు మీడియా ఖచ్చితంగా ఏం జరిగిందో తెలియకుండా చేసే వ్యాఖ్యలతో ఎవరైనా కలత చెందుతారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటివరకు నాకు తెలియదు ... నాకు తెలిసినది మొదటి పేజీ .. రెండో పేజీ ఫీచర్లు మాత్రమే. నేను నిజంగా చెడ్డ డిజైనర్‌గా ఉన్నానో లేదా ఇంకేమైనా కానీ.. ఐశ్వర్యారాయ్ నా దుస్తులను ధరించి నన్ను విశ్వసిస్తోందని నేను భావించాను'' అని నీతా లుల్లా చెప్పారు. స్టైలిస్ట్‌లందరూ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి తమ డిజైనర్లతో కలిసి వెళ్లేది ఎందుకంటే ఇలాంటివి జరగకుండా చూసేందుకేనని నీతా చెప్పారు. నీతా, ఐశ్వర్యల మధ్య సినిమాల్లో చాలా కాలం అనుబంధం ఉంది. 2007లో అభిషేక్ బచ్చన్‌తో ఐశ్వర్యరాయ్ పెళ్లి కోసం ఆమె కంజీవరం చీరను డిజైన్ చేసింది. ఆ చీరలో ఐష్ ముగ్ధ మనోహర రూపం అభిమానులను కట్టి పడేసింది.

# లక్కీ భాస్కర్ ఇంతలోనే 'కాంత'.. దుల్కర్ ఇస్పీడ్..

ఇంతలోనే ఇప్పుడు రానా దగ్గుబాటి సమర్పణలో 'కాంత' అనే చిత్రాన్ని ప్రకటించారు. నేటితరం లో పాన్ ఇండియా స్టార్ గా ఓ వెలుగు వెలుగుతున్నాడు దుల్కర్ సల్మాన్. అతడు తన పరిధిని మలయాళం నుంచి తెలుగుహిందీ భాషల కు విస్తరించాడు. పాన్‌ఇండియా స్థాయి లో ఉత్తమ నటుల లో ఒకడిగా తన ఖ్యాతిని పెంచుకున్నాడు. ఇటీవల దుల్కర్ తెలుగులో స్పీడ్ మరింతగా పెంచాడు. బ్యాక్ టు బ్యాక్ సినిమాల ను ప్రకటిస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఓకే బంగారంతో తెలుగు వారి మనసుల పై బలమైన ముద్ర వేసాడు. ఇటీవల 'సీతారామం' బ్లాక్ బస్టర్ ఫలితం తర్వాత వెంకీ అట్లూరి తదుపరి పాన్‌ఇండియా చిత్రం లో దుల్కర్ నటిస్తుండడం ఆసక్తిని కలిగించింది. ఇంతకుముందే ఈ చిత్రానికి 'లక్కీ బాస్కర్' అనే టైటిల్‌ను ప్రకటించారు. ఇంతలోనే ఇప్పుడు రానా దగ్గుబాటి సమర్పణలో 'కాంత' అనే చిత్రాన్ని ప్రకటించారు. ''చాలా అరుదుగా 'మంచి సినిమా' అనే భావన ను పెంచే కథ తో ఇది తెరకెక్కుతోంది. #కాంత అనేది మేధావుల ను ఏకతాటిపైకి చేర్చిన ప్రాజెక్ట్. అపారమైన ప్రతిభావంతుడు దుల్కర్ సల్మాన్ ... వేఫేరర్ ఫిలింస్ తో ఈ ప్రయాణాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది. పుట్టినరోజు శుభాకాంక్షలు DQ .. కాంతా ప్రపంచానికి స్వాగతం'' అంటూ రానా స్వయంగా సోషల్ మీడియా లో ఈ ప్రాజెక్టు ను ప్రకటించారు. కాంత చిత్రాన్ని పాన్ ఇండియా కేటగిరీలో అన్ని భాషల్లో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి రచన & దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్. ఇక దుల్కార్ నటించిన మరో పాన్ ఇండియా చిత్రం 'కింగ్ ఆఫ్ కోథా' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇది ప్రముఖ గ్యాంగ్ స్టర్ జీవితకథతో తెరకెక్కుతోంది.




# మిస్టర్ X లో శరత్ కుమార్

స్టార్ హీరోలు ఆర్య & గౌతమ్ కార్తీక్ ప్రధాన పాత్రలలో మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియన్ మూవీ "మిస్టర్ X. ప్రముఖ నటి మంజు వారియర్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణ్ కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో సుప్రీం స్టార్ శరత్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. అనౌన్స్ మెంట్ పోస్టర్ లో స్టైలిష్ అండ్ ఇంటెన్స్ లుక్ లో కనిపించారు శరత్ కుమార్. హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న "మిస్టర్ X" యాక్షన్ సన్నివేశాల్ని భారతదేశం, ఉగాండా, అజర్‌బైజాన్, జార్జియా దేశాల్లో చిత్రీకరిస్తున్నారు. మిస్టర్ X తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తారు.






# 'కెప్టెన్ మిల్లర్' టీజర్ విడుదల

ధనుష్ హైబడ్జెట్ పీరియడ్ ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ధనుష్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. 2023లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ పీరియాడికల్ ఫిల్మ్ 1930 40ల నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని టి.జి. త్యాగరాజన్ సత్యజ్యోతి ఫిల్మ్స్, సెంధిల్ త్యాగరాజన్ ,అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ధనుష్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ చిత్ర నిర్మాతలు టీజర్‌ను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఏఏఏ సినిమాస్‌లో జరిగిన టీజర్ లాంచ్ ఈవెంట్ కి హీరో సందీప్ కిషన్‌తో పాటు ఐదు మంది అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ.. "టీజర్ లాంచ్ హైదరాబాద్‌లో మాత్రమే జరుగుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ధనుష్ అన్న స్వయంగా దర్శకత్వం వహించే తన యాభైయవ నేను ఒక ప్రధాన పాత్రలో నటిస్తున్నానని ధనుష్ అన్న పుట్టినరోజు సందర్భంగా చెబుతున్నా' అన్నారు . .




# 'జిలేబి' నుంచి పాట

నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, మన్మధుడు లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలని అందించిన మోస్ట్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ కె. విజయభాస్కర్ చాలా విరామం తర్వాత చేస్తున్న యూత్ ఫుల్ ఫన్ అండ్ థ్రిల్లర్ ఎంటర్ టైనర్ 'జిలేబి'. ప్రముఖ పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ ఎస్ఆర్కే ఆర్ట్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అంజు అశ్రాని చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో శివాని రాజశేఖర్ కథానాయికగా నటిస్తోంది. నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. జిలేబి హిలేరియస్ థ్రిల్లింగ్ ఎంటర్ టైనర్ అని టీజర్ భరోసా ఇచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఆకు పాకు' అనే పాటని విడుదల చేశారు మేకర్స్. మెలోడి బ్రహ్మ మణిశర్మ ఈ పాటని క్యాచి నెంబర్ గా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి అందించిన సాహిత్యం మరో ఆకర్షణగా నిలిచింది. రాహుల్ సిప్లిగంజ్ ఎనర్జిటిక్ గా పాడిన ఈ పాటలో లీడ్ పెయిర్ కంగారు పడుతూ పరుగులు తీయడం థ్రిల్లింగ్ గా వుంది.



# జాన్వీ సొగసు చూడతరమా?

నడుమ ఎండతంకు పరిచయిమైన జాన్వీ కపూర్ పై ఆరంభం కొన్ని విమర్శలు వచ్చాయి. తన అందం నటన గురించి విమర్శించినవాళ్లున్నారు. అయితే కొద్ది కాలానికే తమ అభిప్రాయాల్ని మార్చుకుని జాన్వీ ముగ్ధ మనోహర రూపానికి తన నటనకు మంత్రముగ్ధులం అయిపోతున్నామని పొగిడేసిన వాళ్లు ఉన్నారు. ఇక ఇటీవలి కాలంలో కమర్షియల్ సినిమాల క్వీన్ గా ఎదిగేందుకు జాన్వీ చేయని ప్రయత్నం లేదు. హిందీలో వరుస చిత్రాల్లో నటించి తనని తాను నిరూపించుకున్న జాన్వీ కపూర్ త్వరలోనే టాలీవుడ్ లో ఆరంగేట్రం చేస్తోంది. ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటిస్తోందిఈ సినిమాతో జాన్వీకి పాన్ ఇండియా స్టార్ డమ్ ఖాయమైంది. కొరటాల శివ బిగ్ కాన్వాస్ పై దేవరను చిత్రీకరిస్తుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇకపోతే జాన్వీ కపూర్ నిరంతర ఫోటోషూట్లు అభిమానులకు స్పెషల్ ట్రీట్ గా నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు. తాజాగా చీరలో కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిచ్చింది ఈ బ్యూటీ. చాలా కాలం తర్వాత శ్రీదేవి జూనియర్ ని చూసినట్టుగా ఉందంటూ ఈ ఫోటోలు వీడియోకు అభిమానులు వ్యాఖ్యల్ని జోడిస్తున్నారు. చారెడేసి కళ్లు అందమైన చిరునవ్వుతో జాన్వీ అలా చీరందంలో హొయలు పోతున్న తీరు ఈ వీడియోలో మైమరిపింపజేస్తోంది. ప్రస్తుతం ఇది అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. జాన్వీ సుదీర్ఘ నోట్ సారాంశం: జాన్వీ కపూర్ నటించిన బవాల్ ఇటీవలే ఓటీటీలో విడుదలై విమర్శకుల నుంచి మిశ్రమ స్పందనలు అందుకున్న సంగతి తెలిసిందే.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.